
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 29.0
కనిష్ఠం 22.2
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శుక్రవారం 26 సెప్టెంబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.70 (303.9495)	2,73,116	2,73,116
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.62 (4.10)	11,124.26	10,376.32
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	167.320 (34.6755)	3,68,435	3,82,670

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220

మద్యం టెండర్లకు వేళాయె



మద్యం దుకాణాలను సామాజికవర్గాల వారీగా కేటాయింపునకు కలెక్టరేట్‌లో నిర్వహించిన లాటరీలో టోకెన్ తీసి చూపుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- నేడు నోటిఫికేషన్, దరఖాస్తుల స్వీకరణ సైతం
- ఉమ్మడి జిల్లాలో ఏ-4 కేటగిరీ దుకాణాలు 329
- 2023లో దరఖాస్తుల ద్వారా రూ.305కోట్ల ఆదాయం
- ఈసారి దరఖాస్తులు పెరుగుతాయని అంచనా

జిల్లా	దుకాణాలు	ఎస్సీ	ఎస్టీ	గౌడ్స్	జనరల్
నల్లగొండ	154	14	04	34	102
సూర్యాపేట	93	10	03	27	53
యాదాద్రి	82	07	01	21	53
మొత్తం	329	31	08	82	208

నల్లగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్త మద్యం దుకాణాలు (ఏ-4 వైన్స్ దుకాణాలు) నిర్వహణకు ఎక్సైజ్‌శాఖ గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. 2025-27 సంవత్సరానికి శుక్రవారం నుంచి ఆసక్తిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుంటారు. అక్టోబరు 18 వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. వచ్చిన దరఖాస్తుల నుంచి అక్టోబరు 23న కలెక్టర్ సమక్షంలో డ్రా నిర్వహించి దుకాణాలను కేటాయిస్తారు. ఈ టెండర్లలో ఎంపికయ్యేవారు ఈ ఏడాది డిసెంబరు 1వ తేదీ నుంచి 2027 నవంబరు 31 వరకు దుకాణాలను నిర్వహించుకునేందుకు అనుమతి ఉంటుంది. ఎక్సైజ్‌శాఖ టెండర్లలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులను ఆయా జిల్లా కేంద్రాల్లోని ఎక్సైజ్ కార్యాలయాలతో పాటు, నాంపల్లిలోని ఎక్సైజ్‌శాఖ ప్రధాన కార్యాలయంలోనూ శుక్రవారం నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు అందజేయవచ్చు. ప్రభుత్వ విధానం మేరకు అన్ని జిల్లాల్లో మద్యం దుకాణాల్లో ఎస్సీ, ఎస్టీ, గౌడ్ (బీసీ) కులస్థులకు రిజర్వేషన్ ఉంటుంది. అందుకు గురువారం ఆయా జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు డ్రా తీసి కేటాయింపు చేశారు.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 329 మద్యం దుకాణాల్లో 8 ఎస్టీలకు, 31 ఎస్సీలకు, 82 జనరల్ కేటగిరీకి కేటాయించారు. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేవారు రూ.3లక్షల విలువైన డిమాండ్ డ్రాఫ్ట్‌ను రుసుముగా చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులకు టెండరు దక్కినా దక్కపోయినా ఈ దరఖాస్తు రుసుము వెనక్కిరాదు. రెండేళ్ల క్రితం జరిగిన టెండర్లలో దరఖాస్తు రుసుము రూ.2లక్షలు ఉండగా, ఈసారి రూ.1లక్ష పెంచారు. దరఖాస్తు రుసుము పెంచినప్పటికీ ఈసారి మద్యం దుకాణాలకు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్‌శాఖ అంచనావేస్తోంది.

● 2023లో ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన టెండర్లలో 15,256 దరఖాస్తులు వచ్చాయి. అప్పుడు కేవలం దరఖాస్తుల నుంచే రూ.305.12కోట్ల ఆదాయం ఎక్సైజ్‌శాఖకు సమకూరింది. ఈసారి దరఖాస్తుల రుసుము రూ.లక్ష అదనంగా పెంచినా దరఖాస్తులు కూడా ఎక్కువగా వస్తాయని భావిస్తున్నారు. దరఖాస్తుల ద్వారా కనీసంగా రూ.500 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు.

● మద్యం దుకాణానికి దరఖాస్తు చేయాలనుకునే

మిగతా 8వ పేజీలో...

ఆరు శ్లాబులుగా లైసెన్స్ ఫీజు



రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలకు ఆరు శ్లాబులుగా లైసెన్స్ ఫీజును నిర్ణయించారు. 5వేల లోపు జనాభా ఉన్న దుకాణాలకు లైసెన్స్ ఫీజును రూ.50లక్షలుగా నిర్ధారించారు. 5,001 నుంచి 50వేల జనాభా ఉన్న మద్యం దుకాణాలకు ఫీజు రూ.55లక్షలు, 50,001 జనాభా నుంచి 1లక్ష జనాభా ఉన్న మద్యం దుకాణానికి రూ.60లక్షల ఫీజు ఖరారు చేశారు. 1లక్ష నుంచి 5లక్షల వరకు మద్యం దుకాణం ఫీజును రూ.65లక్షలుగా, 5నుంచి 20లక్షల జనాభా ఉన్న మద్యం దుకాణాలకు రూ.85లక్షలుగా నిర్ధారించారు. 20లక్షల పైబడి జనాభా ఉన్న మద్యం దుకాణాలకు లైసెన్స్ ఫీజు రూ.1.10కోట్లుగా నిర్ధారించారు. ఉమ్మడి జిల్లాలో రూ.60లక్షల లైసెన్స్ ఫీజు దుకాణాల వరకే ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో రూ.60లక్షల శ్లాబులో 40 దుకాణాలు, రూ.55లక్షల శ్లాబులో 88 దుకాణాలు, రూ.50లక్షల శ్లాబులో 26 దుకాణాలు ఉన్నాయి.

రాష్ట్రాన్ని నెంబర్‌వన్‌గా నిలపడమే లక్ష్యం

- పేదలకు సేవలందిస్తా
- గ్రూపు -1 రాష్ట్ర సెకండ్ ర్యాంకర్ దాడి వెంకటరమణ



రాష్ట్రస్థాయి రెండో ర్యాంక్ సాధించిన నల్లగొండకు చెందిన వెంకటరమణ

నల్లగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలు, విద్యార్థులు, బడుగు, బలహీన వర్గాలకు సేవ చేయాలన్న తపన నల్లగొండకు చెందిన దాడి వెంకటరమణను గ్రూప్-1లో రాష్ట్ర రెండో ర్యాంకర్‌గా నిలబెట్టింది. సివిల్స్ సర్వీసెస్‌కు సన్నద్ధమవుతూనే టీజీపీఎస్సీలో గ్రూప్- 1 పరీక్ష రాసి 535.5 మార్కులతో రాష్ట్ర రెండో ర్యాంకు సాధించాడు. జిల్లా కేంద్రం నల్లగొండకు చెందిన దాడి వెంకటరమణ ఆరేళ్లు కష్టపడి చదివి విజయం సాధించాడు. ఆయన విజయం వెనుక తల్లిదండ్రుల కృషి, సహకారం ఎంతగానో ఉంది. వెంకటరమణ తండ్రి శ్రీనివాసరావు ఈడబ్ల్యూఐడీసీలో ఉద్యోగం చేస్తుండగా, తల్లి రమాదేవి విద్యాశాఖలో ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. అంతకుముందు మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు వెంకటరమణ ఎంపికయ్యారు. డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా, జూనియర్ లెక్చరర్‌గా, గ్రూపు -2లో 378 ర్యాంకును సాధించాడు. గ్రూప్ -1 లో రాష్ట్ర సెకండ్ ర్యాంకు సాధించడంతో డిప్యూటీ కలెక్టర్ పోస్టు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర రెండో ర్యాంకు సాధించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత 2022లో ఇచ్చిన మొదటి గ్రూపు - 1 నోటిఫికేషన్‌లో ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందన్నారు. పది మందికి ఉపయోగపడలన్నాదే తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. ప్రైవేట్ స్టడీ సెంటర్‌లో ఉదయం 8 నుంచి రాత్రి 12.30 గంటల వరకు చదివేవాడినని, ప్రతీ సబ్జెక్టు సంబంధించి ప్రత్యేకంగా ఒక నోట్స్ ఉండేదన్నారు. తెలంగాణను నెంబర్‌వన్‌గా నిలపడమే తన ముందున్న లక్ష్యమన్నారు. ఎవరికైనా ప్రతీసారి సక్సెస్ అనేది రాకపోవచ్చని, నిరుత్సాహపడకుండా కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని వెంకటరమణ అన్నారు.

కష్టపడ్డారు.. సాధించారు

ఉమ్మడి జిల్లా వాసులకు ర్యాంకుల పంట

7

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఎమ్మెల్యే బాలునాయక్

ఎస్పీ శరత్‌చంద్రపవార్, ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, ఏఎస్పీ మౌనికతో కలిసి దేవరకొండలో అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేసిన 100 సీసీ టీవీ కెమెరాలను ప్రారంభించి మాట్లాడారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీస్ సిబ్బందితో సమానమని, వీటిని ప్రతీ ప్రాంతంలో ఏర్పాటు చేయడం ద్వారా నేర రహిత సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. దేవరకొండ పట్టణంతోపాటు గుర్రంపోడు మండల కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్‌స్టేషన్లకు అనుసంధానం చేసి కమాండ్ కంట్రోల్‌రూంను ప్రారంభించినట్లు తెలిపారు. వీటి ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే బాలునాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ, పట్టణంలో నేర నియంత్రణకు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పట్టణంలోని అన్ని ప్రధాన కూడలీలు, కాలనీల్లో వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, సీఐ వెంకట్‌రెడ్డి, కొండమల్లేపల్లి సీఐ నవీన్, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎస్ఐలు మధు, నారాయణరెడ్డి, మౌనిక, సాలకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఓట్ చోర్' సంతకాల సేకరణ

ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

నల్లగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓట్ చోర్‌పై జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి సంతకాల సేకరణ చేపట్టనున్నట్టు ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ తెలిపారు. గురువారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఓట్ చోర్‌పై ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. అయినా ఎన్నికల కమిషన్ కేంద్రానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీహార్, మహారాష్ట్రలో ఓట్ల తొలగింపునకు పాల్పడిందని ఆరోపించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు బీజేపీ ఓట్ చోర్‌పై జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయి వరకు సంతకాల సేకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ శ్రేణులంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కేటీఆర్‌ను ఎర్రగడ్డలో చేర్చాలి

(ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ): ప్రజా విశ్వాసం కోల్పోయి అధికారానికి దూరమైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను చూస్తే ఆయన మతి భ్రమించిందని అర్థమవుతోందని, ఆయన్ను ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేర్చాలని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే గన్‌మెన్ లారీ యూరియా మాయం చేశాడని, ఎమ్మెల్యే గౌదాములోని యూరియాను ఖతం చేశాడని కేటీఆర్ వ్యాఖ్యానించడం మతిస్థిమితం లేని చర్య అని అన్నారు. దామరచర్ల మండలం కొత్తపేటలో ఇద్దరు తాగి ఘర్షణపెట్టుకుంటే యూరియా ధర్నాకు వెళ్లినందుకు పోలీసులు కొట్టారని రాజకీయ గుంపును వేసుకుని జగదీ‌ష్‌రెడ్డి పరామర్శల యాత్ర చేయడం విడ్డూరమని విమర్శించారు. యూరియా ధర్నా చేసింది ఎక్కడ? కేసు పెట్టింది ఎక్కడ? ఏమైనా సంబంధం ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రజాపాలనను చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వలేక విమర్శలు చేస్తూ ప్రజల్లో మరింత పలచనవుతున్నారని అన్నారు. కేటీఆర్‌ను ఎర్రగడ్డకు, చోటా నేతలను ఉస్మానియాకు పంపించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రశ్నించినవారిపై కేసులు పెట్టి, మీడియాపై కూడా నిర్బంధం విధించిన వారు పరామర్శల పేరుతో రాజకీయ యాత్రలు చేస్తున్నారని విమర్శించారు. ఈ విధానాన్ని మార్చుకోకపోతే ప్రజాక్షేత్రంలో మరింత భంగపాటు తప్పదని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు స్కైలాబ్‌నాయక్, చిరుమర్రి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

యంగ్ ఇండియా స్కూల్ పనులు ప్రారంభించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

మునుగోడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని సర్వే నెంబర్ 78లో కేటాయించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల స్థలం, అక్కడికి వెళ్లే రహదారి, పరిసరాలను ఆమె పరిశీలించారు. వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్ని వర్గాల విద్యార్థులు ఒకే చోట విద్య అభ్యసించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. నిబంధనల ప్రకారం అన్ని హంగులతో నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజలు, రైతులు సమస్యల పరిష్కారం కోసం చేసిన దరఖాస్తులతో పాటు 'ప్రజావాణి' ద్వారా చేసుకున్న ఫిర్యాదులను పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం మునుగోడు తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. భూభారతి దరఖాస్తులు, సమస్యలు, దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీదేవి, మునుగోడు ఇన్‌చార్జి తహసీల్దార్ నేలపట్ల నరేష్, ఎంపీడీవో యుగంధర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మల్లిఖార్జున్‌రావు, గిర్దావర్ వంశీ, సర్వేయర్ నాగేశ్వరావు, తదితరులు ఉన్నారు.





నల్లగొండ ఎన్జీ కళాశాల మైదానంలో రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, మహిళలు

యువకుడిని కొట్టామనడం అవాస్తవం

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వాడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామరచర్ల మండలం కొత్తపేటతండాకు చెందిన యువకుడు సాయిసిద్ధును యూరియా కోసం జరిగిన ధర్నాల్లో పాల్గొన్నాడనే కారణంతో పోలీసులు కొట్టారని చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పేర్కొన్నారు. సాయిసిద్ధుకు సంబంధించిన కేసులు, వాటిపై వాడపల్లి పోలీసులు చేసిన విచారణ వివరాలను ఎస్పీ బుధవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు.

సాయిసిద్ధు, అతడి స్నేహితుల మధ్య ఘర్షణలపై నమోదైన కేసుల్లోనే ఈ నెల 9వ తేదీన పూర్తి వైద్యపరీక్షలు నిర్వహించి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. సాయిసిద్ధు, సుమన్ స్నేహితులు కాగా, వీరిద్దరు ఇతర స్నేహితులతో కలిసి గ్రామం చివర ఆరుబయట మద్యం తాగుతారని తెలిపారు. ఆ క్రమంలోనే ఈ నెల 2న సాయిసిద్ధు, అతడి సోదరుడు నవీన్, స్నేహితుడు సుమన్, మరోవ్యక్తి కలిసి ఊరి బయటకు వచ్చారని, అక్కడ మాటామాటా పెరిగి వారి ఘర్షణ పడ్డారన్నారు. ఈ ఘర్షణలో సుమన్ చేసిన దాడితో సాయిసిద్ధు, అతడి సోదరుడు నవీన్ తలకు గాయమైందని తెలిపారు. అక్కడ తగాదా ముగిశాక ఎవరిళ్లకు వారు వెళ్లిపోయారని, అయితే దీన్ని మనసులో పెట్టుకొని అదేరోజు రాత్రి సాయిసిద్ధు, నవీన్ కలిసి సుమన్ ఇంటికి వెళ్లి అతని గురించి వెతికారన్నారు. సుమన్ ఇంట్లో లేడని తెలిసి అతడి తల్లిదండ్రులపై దాడిచేశారని తెలిపారు. ఈ దాడిలో సుమన్ తల్లికి ముక్కుకు గాయాలవగా, తండ్రికి పక్కటెముకలు విరిగాయని తెలిపారు. ఈ ఘర్షణల నేపథ్యంలో ఇరువర్గాలపై రెండు వేర్వేరు కేసులు వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదయ్యాయని చెప్పారు. ఈ కేసు నేపథ్యంలోనే ఈనెల 9వ తేదీన సాయిసిద్ధు, నవీన్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్పీ వివరించారు. అయితే ఈనెల 3న మిర్యాలగూడ పట్టణంలోని చింతపల్లి క్రాస్ రోడ్డు వద్ద యూరియా కోసం జరిగిన ధర్నాలో సాయిసిద్ధు పాల్గొన్నందుకే పోలీసులు స్టేషన్‌కు తరలించి కొట్టారని ఆరోపించడం పూర్తి అవాస్తవమని ఎస్పీ పేర్కొన్నారు. 2న జరిగిన ఘర్షణకు సంబంధించిన కేసులోనే సాయిసిద్ధుకి పూర్తి వైద్యపరీక్షలు చేయించి, పూర్తి ఆధారాలతో రిమాండ్‌కు తరలించామని వివరించారు. నేరాల నియంత్రణకు పోలీస్‌శాఖ నిరంతరం కృషి చేస్తోందని, పోలీస్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఎవ్వరూ వ్యవహరించవద్దని ఎస్పీ శరత్‌చంద్రపవార్ సూచించారు.

ఉపాధి కూలీలకు సురక్ష బీమా యోజన

డీఆర్డీవో శేఖర్‌రెడ్డి



వేములపల్లి మండలంలో ఈ-కేవైసీ నమోదును పరిశీలిస్తున్న డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

మిర్యాలగూడ అర్బన్/వేములపల్లి సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద జాబ్‌కార్డు ఉన్న కూలీలకు పీఎం సురక్ష బీమా యోజన వర్తించేలా చర్యలు తీసుకుంటున్నామని డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మిర్యాలగూడ, వేములపల్లి మండలాల్లో ఈ-కేవైసీ నమోదును ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జాబ్ కార్డు ఈ-కేవైసీ చేయించుకోవడం ద్వారా బీమా లబ్ధిచేకూరుతోందన్నారు. ఇప్పటికే జిల్లాలోని 3.38లక్షల జాబ్‌కార్డులకు ఆధార్ సీడింగ్ పూర్తిచేశామన్నారు. ఆయా జాబ్‌కార్డుల్లో నమోదైన 7.30లక్షల మంది కూలీల ఈ-కేవైసీ నమోదు చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియను ఫీల్డ్ అసిస్టెంట్లు వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేశారు. ఈ-కేవైసీ చేయించుకున్న కూలీలకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన ద్వారా రూ.2లక్షల బీమా వర్తిస్తుందన్నారు. దీనికి ఏటా రూ.20 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. రుణాల వసూలులో వేములపల్లి, నకిరేకల్, చండూరు మండలాలు ముందువరుసలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ నర్సింహారావు, ఎంపీడీవోలు జితేందర్ రెడ్డి, ఎంఎస్.శర్మ, ఏపీవోలు సూరానాయక్, మిరాజ్‌అలీ, పంచాయతీకార్యదర్శులు శ్రవన్ కుమార్, రాజశేఖర్, ఏపీఎం జానకి, దిలీప్‌కుమార్, సీసీ గోపి, సీవో ప్రసాద్, సీసీ శ్రీను, మిస్కిన్, టీఏలు పావని, కళ, రమణ, ఎఫ్ఏలు తులసి, మధు, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణ సక్రమంగా ఉండాలి

(ఆంధ్రజ్యోతి, దామరచర్ల): నర్సరీల నిర్వహణ సక్రమంగా ఉండాలని డీఆర్‌డీవో వై.శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వాడపల్లి, కొండ్రపోల్ గ్రామాల్లోని వన నర్సరీలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. అనంతరం ఉపాధిహామీ కూలీల ఈ-కేవైసీ విధానాన్ని పరిశీలించారు. ఆయన వెంట క్లస్టర్ ఏపీడీ బాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

జిల్లాకు జాతీయ పురస్కారం



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్ సంచయ్ జౌర్ జన్ భాగీదారీ ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారానికి జిల్లా ఎంపికైంది. ఈ పురస్కారానికి నల్లగొండ, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలను కేంద్రం ఎంపిక చేసింది. దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు పోటీపడగా తొలి మూడు స్థానాలను తెలంగాణ జిల్లాలే దక్కించుకున్నాయి. ఈ పురస్కారం కింద కేంద్రం రూ. 2కోట్లు ఇవ్వనుంది. ఈ మేరకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో అభినందించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి హామీ సిబ్బంది కృషి ఫలితంగానే జాతీయ పురస్కారం దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ సిబ్బంది, అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

9 నుంచి లతీఫుల్లాషా ఖాద్రి ఉర్సు

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని హజ్రత్ సయ్యద్ లతీఫుల్లాషా ఖాద్రి దర్గా ఉర్సు ఉత్సవాలు అక్టోబరు 9వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని దర్గా మెట్ల వద్ద ఉర్సు ఉత్సవ కమిటీ, దర్గా ఇనాందార్ ముతవల్లుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబరు 9న సాయంత్రం మదీనా మసీదు నుంచి గంధం ఊరేగింపు ప్రారంభమై దర్గా మెట్ల వద్దకు చేరుకుంటుందన్నారు. 10న దీపాలంకరణ, 11న రాత్రి కళాకారుల ఖవ్వాలి ఉంటుందన్నారు. ఉర్సు ప్రధాన ఘట్టాలు మూడు రోజులే ఉన్నా, భక్తుల దర్శనాలతో నెల రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తామన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచే గాక, ఇతర రాష్ట్రాల నుంచి కూడా హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పిస్తామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక చొరవతో దర్గా ఘాట్ రోడ్డు పనులు ప్రారంభించినా, కొందరు రాజకీయ దురుద్దేశంతో అడ్డంకులు కల్పిస్తున్నారని విమర్శించారు. అనంతరం ఉర్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈ అశోక్, మాజీ కౌన్సిలర్లు నవీన్‌గౌడ్, ఇంతియా, ఇబ్రహీం, ఉర్సు కమిటీ వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ ఖాజా గౌస్ మోహినుద్దీన్, సీపీఎం నేత హాశం, మసి, ఇంతియా హుస్సేన్, దర్గా ఇనాందార్ ముతవల్లులు సమీఉల్లా ఖాద్రి, గౌస్ ఉల్లా ఖాద్రి, జమాల్ ఖాద్రి, ఉబేద్‌ఖాద్రి, సల్మాన్ ఖాద్రి, తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావాలి

బీజేపీ నేత శ్రీనివాస్ గౌడ్



మొక్క నాటుతున్న బీజేపీ నేత శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వికసిత భారత్ లక్ష్యంగా ప్రజలంతా స్వదేశీ వస్తువులు వినియోగిస్తూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర నేత మాదగోని శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాల్ జన్మదిన సందర్భంగా పానగల్ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండిట్ దీన్‌దయాల్ సమాజంలోని అట్టడుగు వర్గాల వారికి ప్రభుత్వ ఫలాలు దక్కేలా పార్టీ మూల సిద్ధాంతం ఉండాలని పాటుపడ్డారన్నారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో బీజేపీ దేశ వ్యాప్తంగా పలు సంక్షేమ పథకాలను పేద మధ్యతరగతి వర్గాల కోసం అమలుచేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మిర్యాల వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షుడు పకీర్ మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, మిరియాల గిరి, పిన్నింటి నరేందర్‌రెడ్డి, కిషన్, శ్రీధర్, తార, నగేష్, శశిధర్, పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌కు హాజరైన ఎంపీలతో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి(రౌండప్‌లో)

దక్షిణ ప్రపంచ పార్లమెంటేరియన్ల వర్క్‌షాప్‌నకు భువనగిరి ఎంపీ చామల

భువనగిరి టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో పర్యావరణం-సుస్థిరతపై అమెరికాలోని న్యూయార్క్ నగరంలో నిర్వహించిన దక్షిణ ప్రపంచ పార్లమెంటేరియన్ల వర్క్‌షాప్‌కు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. సదస్సులో మొదటిరోజైన గురువారం విశాల స్థాయిశక్తి మార్పిడి, గ్లోబల్ వాతావరణ అవసరాలు, పారిశ్రామిక డీకార్బొనైజేషన్ తదితర అంశాలపై జరిగిన చర్చలలో భారత ప్రభుత్వ ఎంపీల బృందం సభ్యుడిగా భారత వైఖరిని తెలిపారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి అంతర్జాతీయ సహకారం, విధానపరమైన ఆవశ్యకతలు, స్థిరమైన అభివృద్ధి కోసం అనుసరించాల్సిన మార్గదర్శకాలు తదితర అంశాలపై వర్క్‌షాప్‌లో చర్చించారు. పలు దేశాలకు చెందిన ఎంపీలు ఈ సదస్సులో పాల్గొన్నారు.

అనాథ సీనియర్ సిటిజన్లకు పోలీసుల ఆసరా

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అనాథ సీనియర్ సిటిజన్లకు పోలీస్‌శాఖ ఆసరాగా ఉంటుందని యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు అన్నారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణ, మండలంలోని సీనియర్ సిటిజన్లకు ఓల్డ్ ఏజ్ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారైన అనాథ సీనియర్ సిటిజన్లకు తప్పకుండా పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. ఆయనతో పాటుగా సీఐ బొడ్డుపల్లి భాస్కర్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.


గుట్టలో ఓల్డ్ ఏజ్ కిట్స్ అందజేస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు

ఎన్‌పీడీసీఎల్ తరహాలో మాకూ న్యాయంచేయరూ

● ఎన్‌పీడీసీఎల్ పరిధిలో సెమీస్కిల్డ్ వర్కర్లుగా మీటర్‌రీడింగ్ కార్మికుల గుర్తింపు

● టీజీఎస్‌పీడీసీఎల్‌లో పాతపద్ధతి

తెలంగాణ విద్యుత్ శాఖలో తాము వివక్షకు గురవుతున్నట్లు తెలంగాణ రాష్ట్ర సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(టీజీఎస్‌పీడీసీఎల్) మీటర్ రీడింగ్ కార్మికులు వాపోతున్నారు. ఒకే తరహా పని చేస్తున్న మరో డిస్కం నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఎన్‌పీడీసీఎల్) మీటర్‌రీడింగ్ కార్మికులను సెమీస్కిల్డ్ వర్కర్లుగా గుర్తించి తమను విస్మరించడం సరికాదంటున్నారు. వారికి 18 రోజుల పాటు రూ.550 అందజేస్తూ ఉపాధి కల్పించిన తీరుగానే తమకు అవకాశం ఇవ్వాలంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరిటౌన్)


మీటర్ రీడింగ్ తీస్తున్న కార్మికుడు

తెలంగాణ విద్యుత్ శాఖలో రెండు డిస్కంలు ఉన్నాయి. ఒకటి హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే తెలంగాణ రాష్ట్ర సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(టీజీఎస్‌పీడీసీఎల్) కాగా మరొకటి నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఎన్‌పీడీసీఎల్) వరంగల్ కేంద్రంగా పనిచేస్తోంది. ఈ డిస్కంలలో 20 ఏళ్లుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మీటర్ రీడింగ్ తీస్తూ నెలసరి వేతనం రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు పొందుతున్న కార్మికులు పనిచేస్తున్నారు. ఇదిలా ఉండగా గత నెలలో ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని మీటర్‌రీడింగ్ కార్మికులను సెమీ స్కిల్డ్‌వర్కర్స్‌గా గుర్తించి అదనపు పనిదినాలు కల్పిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. రోజుకు రూ.550 చొప్పున 18 రోజులకు ఉపాధి కల్పిస్తున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో

టీజీ ఎస్‌పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 9.45 లక్షల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. 426 మంది మీటర్‌రీడింగ్ కార్మికులు ప్రతినెలా ప్రతి మీటర్ రీడింగ్‌ను నమోదు చేసి స్పాట్‌బిల్లింగ్ ఇస్తున్నారు. స్పాట్ బిల్లింగ్ ఆధారంగానే గృహజ్యోతి వర్తింపు, బిల్లువసూలు ఉంటుంది.

ఒకే తరహా పని అయినా..

టీజీఎస్‌పీడీసీఎల్ నిర్ణయం ప్రకారం తమకు కేటాయించిన ప్రాంతాల్లో ప్రతినెలా మొదటి 6, 7 రోజుల్లో ప్రతి ఇల్లు తిరిగి మీటర్ రీడింగ్ నమోదుచేయాలి. ఇందుకోసం విద్యుత్ మీటర్ల సంఖ్య ఆధారంగా గ్రామీణప్రాంతాల కార్మికులకు సుమారుగా రూ. 5వేలు, పట్టణ కార్మికులకు రూ.7వేల వరకు వేతనం లభిస్తోంది. ఆ నెలలో మిగతా రోజులలో ఆ కార్మికులు తమ సొంత పనులకు వెళ్లవచ్చు. కానీ అధికారులు ఆ కార్మికులతో బిల్లుల వసూలు, తదితర పనులను బలవంతంగా చేయిస్తున్నాయి. భవిష్యత్‌లో ఉద్యోగ భద్రత ఉంటుందనే ఆశతో ఖిమ్మనకుండా నెలరోజులపాటు విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఎన్‌పీడీసీఎల్ పరిధిలో మాత్రం నెలలో మొదటి 12 రోజుల్లో మీటర్‌రీడింగ్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా కార్మికుల దీర్ఘకాలిక డిమాండ్‌ను మన్నిస్తూ వారిని సెమీస్కిల్డ్ వర్కర్స్‌గా గుర్తిస్తూ నెలలో మిగిలిన 18 రోజుల్లో రోజుకు రూ.550 కూలీతో అదనపు పనిదినాలు కల్పిస్తూ కంపెనీ యాజమాన్యం ఆగస్టు 8న ఉత్తర్వులు జారీ చేసి మరుసటి రోజు నుంచే అమలులోకి తెచ్చింది. దీంతో అక్కడి కార్మికులకు నెలకు సుమారుగా రూ.10 వేల పైబడి వేతనం లభిస్తోంది. కానీ టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలో మాత్రం పాతవిధానాలే అమలు చేస్తుండటంతో ఇక్కడి కార్మికులు అన్యాయానికి గురవుతూ ఆర్థికఇబ్బందులతో అల్లాడుతున్నారు.

ఈ నేపథ్యంలో ఎన్‌పీడీసీఎల్ విధానాలను ఇక్కడా అమలుచేయాలని ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు ఇటీవలే మూడు జిల్లాల ట్రాన్స్‌కో ఎస్ఈలకు వినతిపత్రాలు అందజేశారు. అయినప్పటికీ యాజమాన్యం, అధికారుల నుంచి స్పందన కొరవడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విశ్వాసాన్ని వమ్ము చేయవద్దు



ఎన్‌పీడీసీఎల్ మాదిరిగానే టీజీఎస్‌పీడీసీఎల్ మీటర్ రీడింగ్ కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాటాలు చేస్తాం. ఈపాటికే ఆందోళనలు ప్రారంభించాం. కార్మికులను శ్రమదోపిడీకి గురిచేయవద్దు. యాజమాన్యంపై విశ్వాసంతో ఏళ్ల తరబడిగా తక్కువ వేతనాలకు పనిచేస్తున్న కార్మికులకు అన్యాయం చేయవద్దు.

డీ సునీల్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర మీటర్ రీడర్స్ యూనియన్

మాకూ న్యాయం చేయాలి



మీటర్‌రీడింగ్ కార్మికులకు యాజమాన్యం మాకూ న్యాయం చేయాలి. సెమీ స్కిల్డ్ వర్కర్స్‌గా గుర్తించి అదనపు పనిదినాలు కల్పించాలి. 20 ఏళ్లుగా పనిచేస్తున్నా వేతనం రూ.5 వేల నుంచి రూ.7వేల లోపే లభిస్తుండటంతో కార్మికుల కుటుంబాలు అల్లాడుతున్నాయి. ఎన్‌పీడీసీఎల్ విధానాన్ని ఇక్కడా అమలు చేయాలి.

పిక్కి శ్రీనివాస్‌రావు, యూనియన్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు.


వివాదాస్పదస్థలం వద్ద సీఐ చరమందరాజు

12 మంది బైండోవర్

హుజూర్‌నగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమి ఆక్రమణకు సంబంధించి 12 మందిని బైండోవర్ చేసినట్లు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపారు. బస్తీ దవాఖాన ప్రాంతంలో దేవుడి పేరుతో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే ఎవరినీ ఉపేక్షించబోమన్నారు. బైండోవర్ అయిన వ్యక్తులు ఘర్షణలు సృష్టిస్తే తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. హుజూర్‌నగర్ పరిధిలోని మాధవరాయని గూడెం ప్రాంతానికి చెందిన రెండువర్గాలకు చెందిన 12 మందిని బైండోవర్ చేశామని, తిరిగి ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అనంతరం వివాదాస్పద స్థలాన్ని సీఐ పరిశీలించారు. ఆయన వెంట బస్తీ దవాఖాన డాక్టర్ సుప్రియ పాల్గొన్నారు.

బస్సులో ప్రయాణిస్తూనే ఆభరణాల చోరీలు

● నిందితుల నుంచి 18 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

● ఇద్దరి అరెస్ట్, మరొకరు పరారీలో

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులే లక్ష్యంగా చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహ తెలిపారు. వారి నుంచి 18 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ గురువారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 2024ఆగస్టు 18న నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం తుంగతుర్తి గ్రామానికి చెందిన పులిచింతల అరుంధతి మోతె మండలం విభలాపురం గ్రామంలో బంధువుల వివాహానికి వెళ్తోంది. అందులో భాగంగా తన హ్యాండ్‌బ్యాగ్‌లో 18 తులాల బంగారు ఆభరణాలను తీసుకుని బయలుదేరింది. ఈ క్రమంలో విభలాపురం వెళ్లేందుకు సూర్యాపేటలో బంధువులతో కలిసి ఖమ్మం బస్సు ఎక్కింది. ఆమెను గమనించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా బుద్రాపేట గ్రామానికి చెందిన గారడి జ్యోతి, హైదరాబాద్‌లోని బడంగ్‌పేట్‌కు చెందిన మహ్మద్ షేక్ సమీర్, కడప జిల్లాకు చెందిన దుర్గలు ప్రయాణికుల మాదిరే అదే బస్సు ఎక్కారు. కొంత దూరం వెళ్లాక ఆభరణాలు ఉన్న బ్యాగును చోరీ చేశారు. విభలాపురం వెళ్లాక బ్యాగ్ చూసుకున్న అరుంధతి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి వెంటనే మోతె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు సాంకేతికతను వాడుకుని అనుమానితులను గుర్తించినా వారి పూర్తిసమాచారం లభించలేదు. ఈ క్రమంలో ఈ నెల 24న ఖమ్మం-సూర్యాపేట జాతీయరహదారిపై మునగాల సీఐ రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చిన కారులో అనుమానాస్పదంగా ఉన్న జ్యోతి, సమీర్‌లను విచారించారు. ఈ క్రమంలో మోతె మం డల పరిధిలో గతేడాది ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలి బ్యాగులోని ఆభరణాలు చోరీ చేసింది తామేనని అంగీకరించారు. అనంతరం వారి కారును తనిఖీచేయగా సుమారు రూ.20లక్షల విలువైన 18 తులాల బంగారు ఆభరణాలు లభించాయి. ప్రధాన నిందితురాలు జ్యోతిపై గతంలో కేసులు ఉండడంతో హైదరాబాద్‌లో విక్రయిస్తే అనుమానం వస్తుందని భావించి ఆభరణాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విక్రయించాలని ఖమ్మం మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్తూ పట్టుబడినట్లు ఎస్పీ తెలిపారు. కాగా చోరీ కేసులో దుర్గ అనే మరో మహిళ కూడా పాల్గొన్నట్లు తెలిపారు. బంగారు ఆభరణాలతో పాటు కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ ప్రకటించారు.


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపుతున్న ఎస్పీ నర్సింహ

ప్రస్తుతం జ్యోతి, సమీర్‌లను కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నామని మరో నేరస్తురాలు దుర్గ పరారీలో ఉందని ఆమెను కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు. నిందితురాలు గారడి జ్యోతిపై మహబూబ్‌నగర్, సంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో ఏడు చోరీ కేసులు ఉన్నాయన్నారు. చోరీ కేసును చాకచక్యంగా ఛేదించిన మునగాల సర్కిల్, సీసీఎస్ పోలీసులను ఎస్పీ అభినందించి, రివార్డులు అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, మునగాల సీఐ రామక్రిష్ణారెడ్డి,అప్పటి మోతె ఎస్ఐ యాదవేంద్రరెడ్డి, సీసీఎస్ ఎస్ఐ హరిక్రిష్ణ ఉన్నారు.

కోడి అన్నవాహికలో ప్లాస్టిక్ వ్యర్థాలు


శస్త్ర చికిత్స అనంతరం కోడి

కోదాడరూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలలో కోడి అన్నవాహికలో చిక్కుకున్న పావు కిలో ప్లాస్టిక్‌వ్యర్థాలను గురువారం శస్త్ర చికిత్స తొలగించారు. అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య తెలిపినవివరాల ప్రకారం సూర్యాపేటకు చెందిన వెంకన్న చెందిన కోడిపుంజు అన్నవాహిక భాగం ఎనిమిది రోజుల కిందట ఉబ్బి మేతమేయడం లేదు. దీంతో సూర్యాపేట ప్రాం తీయ పశువైద్యశాలలో వైద్యం చేయించారు. అప్పటికీ పరిస్థితిలో మార్పులేకపోవడంతో అక్కడి వైద్యుల సలహామేరకు కోదాడ ప్రాం తీయ పశువైద్యశాలకు తీసుకు వచ్చారు.కోడిని పరీక్షించి అత్యవసరంగా శస్త్ర చికిత్స నిర్వహించి, అన్నవాహిక భాగంలో ఉన్న పావు కిలో ప్లాస్టిక్‌వ్యర్థాలను, అందులో చిక్కుకున్న ధాన్యం వ్యర్థాలను బయటకు తీశారు. కుట్లువేసి విజయవంతంగా శస్త్రచికిత్స ముగించినట్లు అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య తెలిపారు. శస్త్రచికిత్సలో సిబ్బంది చంద్రకళ, అఖిల్, సాగర్ పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు సౌమ్య ఎంపిక

కనగల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలం జీఎడవల్లి ఉన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థి పర్సనబోయిన సౌమ్య జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైంది. హైదరాబాద్ నిజాం కళాశాలలో ఈ నెల 26 నుంచి 29 వరకు జరిగే జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్రం తరపున ఆడనున్నట్లు హెచ్ఎం దొడ్డి విజయలక్ష్మి, పీడీ నారాయణ కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా సౌమ్యకు పలువురు అభినందించారు.


సౌమ్య

విద్యుదాఘాతంతో మెకానిక్ మృతి


హనుమయ్య(ఫైల్‌ఫొటో)

ఆత్మకూరు(ఎస్), సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం దాచారం గ్రామంలో విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ బుడిగబోయిన హనుమయ్య(58) గురువారం మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం దాచారం గ్రామానికి చెందిన పులుగుజ్జు మల్లయ్య అనే రైతు వ్యవసాయ పొలం వద్ద బోర్‌కు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో ఎలక్ట్రీషియన్ హనుమయ్యను మరమ్మతుల కోసం తీసుకెళ్లాడు. విద్యుత్ తీగలను పరిశీలిస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై హనుమయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు హనుమయ్య మృతదేహంతో రైతు మల్లయ్య ఇంటి ఎదుట ఆందోళన చేశారు. కాగా రాత్రి పొద్దుపోయే వరకు ఆందోళన కొనసాగుతోంది. హనుమయ్య కూమారుడు శంకర్ ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ దస్తగిరి తెలిపారు. కాగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు చేపట్టారు. రైతు మల్లయ్యను అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్ఐ దస్తగిరి తెలిపారు. హనుమయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రైలుకు ఎదురెళ్లి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం జరిగింది. రైల్వే ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ-కొండ్రపోల్ రైల్వేమార్గంలో వెళ్తున్న చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలుకు సుమారు 40 ఏళ్ల వయసుగల వ్యక్తి ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే రైలుపట్టాలపై గాయాలతో ఓ వ్యక్తి పడిఉండగా గుర్తించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు. బ్లాక కలర్ జీన్‌పాయింట్, తెల్లషర్టు అతడి శరీరంపై ఉందని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మిర్యాలగూడ రైల్వేస్టేషన్ మాస్టర్ రామారావు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని మృతుడి ఆచూకీ తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని రైల్వే ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

వరుస చోరీలకు పాల్పడిన దొంగ అరెస్ట్

చివ్వెంల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. గురువారం సూర్యాపేట జిల్లా చివ్వెంలలో ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 22న సూర్యాపేట పరిధిలోని కొండలరాయినిగూడెంలో వల్లపు రాణి, కొంపెల్లి జయమ్మ, అల్లి మల్లిక ఇళ్లలో వరుసగా చోరీలు జరిగాయి. వీటిపై బాధితులు ఫిర్యాదు చేయగా విచారణ ప్రారంభించామన్నారు. గురువారం మండలంలోని బీబీగూడెం శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా సూర్యాపేట పట్టణంలోని సీతారాంపురంకాలనీకి చెందిన గంపల శ్యామ్‌కుమార్ అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. విచారణలో కొండలరాయినిగూడెంలో వరుస దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని డీఎస్పీ ప్రసన్నకుమార్ వెల్లడించారు. నిందితుడి నుంచి ద్విచక్రవాహనం, 15.25 గ్రాముల బంగారం, 274 గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. డీఎస్పీ వెంట సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐలు మహేశ్వర్, రత్నం, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, ఉన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్, ఎస్సైలు మహేశ్వర్, రత్నం

ఎక్స్‌గ్రేషియాను వెంటనే విడుదల చేయాలి

కట్టంగూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియాను వెంటనే విడుదల చేయాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు రాచకొండ వెంకన్న డిమాండ్ చేశారు. ఈ నెల 27న కట్టంగూరులో నిర్వహించే సంఘం 4వ మహాసభ కరపత్రాలను గురువారం నల్లగొండ జిల్లా కట్టంగూరులో ఆవిష్కరించారు. మద్యం దుకాణాల్లో గౌడ కులస్థులకు రిజర్వేషన్ పెంచితే ప్రభుత్వానికి లాభం తప్ప నష్టం ఉండదన్నారు. 50 ఏళ్లు నిండిన వృత్తిదారులకు పింఛన్‌తో పాటు ద్విచక్రవాహనాలు, ప్రతి గ్రామంలో తాటి, ఈత వనాల పెంపకానికి భూమి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల అంజయ్య, గుడుగుంట్ల బుచ్చిరాములు, దండెంపల్లి శ్రీను, మాద శ్రీను, పాడిచేటి వీరయ్య, గుండాల నగేష్, రాములు, సత్తయ్య ఉన్నారు.

వేబ్రిడ్జిలో తప్పుడు తూకాలతో మోసం

● పట్టుకుని నిలదీసి, వేబ్రిడ్జి గదికి తాళం వేసిన రైతులు

మోత్కూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజీపురంలో వేబ్రిడ్జిలో తూకంలో తేడాలను గుర్తించిన రైతులు వ్యాపారిని నిలదీసి, తాళం వేసి నిరసన తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అనాజీపురం గ్రామానికి చెందిన మలిపెద్ది సంతోష్ రెడ్డి గురువారం రెండు ట్రాక్టర్లలో ధాన్యం తెచ్చి స్థానిక వేబ్రిడ్జిపై తూకం వేయించి ప్రైవేటు వ్యాపారి అంతటి నర్సయ్యకు విక్రయించాడు. అయితే ధాన్యం తూకం రావాల్సినంత రాలేదన్న అనుమానంతో ధాన్యం దిగుమతి చేశాక ఖాళీ ట్రాక్టర్‌ను సమీపంలోని దాచారం వేబ్రిడ్జిపై తూకం వేయించాడు. దీంతో తూకాల్లో క్వింటా 40 కిలోలు తేడా(తక్కువగా) ఉన్నట్లు గుర్తించాడు. అక్కడ తీసుకున్న తూకం రశీదును చూపి అనాజీపురం వేబ్రిడ్జి నిర్వాహకుడిని నిలదీశాడు. ఇదే సమయంలో అక్కడికి పలువురు రైతులు చేరుకుని తామూ ఇలాగే మోసపోయి ఉంటామని భావించి వ్యాపారిని ప్రశ్నించారు. రెండు ట్రాక్టర్లలో మొదటి ట్రాక్టర్ తూకం సరిగానే వచ్చిందని, రెండో ట్రాక్టర్ తూకం సమయంలో జంప్ అయి తక్కువ తూకం వచ్చిందని వ్యాపారి వివరించాడు. తక్కువ వచ్చిన ధాన్యానికి డబ్బులు ఇస్తానని చెప్పి రైతును సముదాయించేందుకు ప్రయత్నించాడు. మిగతా రైతులు ఒప్పుకోకుండా తాము కూడా నష్టపోయి ఉంటామని, తమ సంగతేమిటంటూ నిలదీసి, కార్యాలయ గదికి తాళం వేసి, వేబ్రిడ్జిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గదికి తాళం వేయడంతో ఆ వ్యాపారి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తూనికలు, కొలతల అధికారులు వేబ్రిడ్జిని పరిశీలించి తక్కువ తూకంతో మోసం చేస్తున్న వ్యాపారిపై చర్య తీసుకోవాలని కోరారు. కొద్దిసేపటి తర్వాత రైతులు వెళ్లిపోయారు. ఈ విషయమై ధాన్యం వ్యాపారి నర్సయ్యను ప్రశ్నించగా రైతు రెండు ట్రాక్టర్ల ధాన్యం తీసుకురాగా ఒక్క ట్రాక్టర్ తూకం సక్రమంగానే ఉందని, వేబ్రిడ్జి కనెక్టు అయిన వైర్లలో లూజు కాంటాక్ట్ ఉండటంతో జంప్‌అయి ఒకదానిలో మాత్రమే తూకంలో తేడా వచ్చిందన్నారు. తేడా వచ్చిన మేర ధాన్యం డబ్బులు ఇస్తానని చెప్పానన్నారు.


వేబ్రిడ్జిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

ఆగి ఉన్న కారును ఢీకొట్టిన లారీ


ప్రమాదంలో దెబ్బతిన్న కారు


అద్వితిరియా మృతదేహం

కట్టంగూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అతి వేగంగా, అజాగ్రత్తగా వచ్చిన సిమెంటు లారీ ఆగి ఉన్న కారును ఢీకొనటంతో బాలిక దుర్మరణం చెందింది. గురువారం నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం ముత్యాలమ్మగూడెం గ్రామశివారులోని జాతీయ రహదారిపై ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలోని చీమలగడ్డకు చెందిన కందుల లాజరస్ భార్య కందుల రుతు ఝాన్సీ, కుమార్తె లవీన, మనుమరాళ్లు ఎండీ.అరీనా, రెమిడాల అద్వితిరియా (14) కారులో హైదరాబాద్ బయలుదేరారు. మార్గమధ్యలోని ముత్యాలమ్మగూడెం శివారు గచ్చుగూరి చెరువు వద్దకు రాగానే కారు టైరు పంక్చర్ అయ్యింది. డ్రైవర్ ఏర్పుల సామేల్ కారును రహదారి పక్కన నిలిపి టైరు మార్చుతున్న క్రమంలో రుతుఝాన్సీ, లవీన, అరీనా కిందకు దిగి పక్కకు నిలబడగా, అద్వితిరియా కారు ముందు నిలబడింది. అదే క్రమంలో కోదాడ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ లారీ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారు ముందు నిలబడిన అద్వితిరియాకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సాయంతో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తాత లాజరస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ అక్కడ నుంచి పరారయ్యాడు.

ట్రాక్టర్ కింద పడి వృద్ధురాలు

శాలిగౌరారం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల పరిధిలో ట్రాక్టర్ కింద పడి వృద్ధురాలు మృతి చెందింది. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వల్లాల పంచాయతీ పరిధిలోని జోలం వారిగూడెం గ్రామానికి చెందిన జోలం మల్లమ్మ(60) హైదరాబాద్‌కు వెళ్లింది. గురువారం సాయంత్రం జోలం వారిగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళా స్కూటీపై వెనక కూర్చుని స్వగ్రామానికి వస్తోంది. మార్గమధ్యలో నిర్మాణంలో ఉన్న రోడ్డుపై స్కూటీ నుంచి జారి పడింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఆమె మీది నుంచి పోవడంతో మల్లమ్మ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. స్కూటీ నడుపుతున్న మహిళా ప్రాణాపాయ నుంచి బయటపడింది. మృతురాలు మల్లమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దుబాయ్ ఏజెంట్ చేతిలో మోసపోయిన మిర్యాలగూడవాసి

స్వదేశానికి తీసుకురావాలని కుటుంబ సభ్యుల వేడుకోలు


వివరాలు తెలుపుతున్న గౌస్ కుటుంబ సభ్యులు.

పంజాగుట్ట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దుబాయిలో ఏజెంట్ చేతిలో మోసపోయి అక్కడే దిక్కుతోచని స్థితిలో ఉన్న మొహమ్మద్‌గౌస్‌ను తీసుకురావాలని నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన ఆయన కుటుంబ సభ్యులు వేడుకున్నారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. మిర్యాలగూడ రాంనగర్ ప్రాం తానికి చెందిన మొహమ్మద్ గౌస్ భార్య అమీనా సౌఘత్, పిల్లలు అనిసా విసాల్, హర్షత్ వసీల్ అరుబా వాఫియా, ఆసిమ్ వాఫిక్, అతడి తల్లి మహమ్మద్ అఫ్జల్ ఉన్నిసాబేగంలతో కలిసి తన గోడును వెళ్లబోసుకుంది. మొహమ్మద్ గౌస్ స్థానికంగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడని, సంపాదన సరిపోక పోవడంతో దుబాయికి వెళ్లి డబ్బులు సంపాదించుకుని వస్తా అని చెప్పాడన్నారు. ఏజెంట్ సమీర్‌ను సంప్రదించగా రూ.1.20 లక్షల వరకు ఖర్చు వస్తుందని చెప్పగా, అప్పు చేసి 2023 మార్చి 21న దుబాయికి వెళ్లాడన్నారు. అక్కడ సమీర్ తన భర్తకు ఒక కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా పెట్టించాడని, 4 నెలల పాటు అతనే చేతి ఖర్చులకు డబ్బులు కూడా ఇచ్చారని తెలిపింది. ఈ క్రమంలో సమీర్ వద్ద పనిచేస్తున్న విక్కీ అలియాస్ హిమాన్షు శుక్ల వేద్, డ్రైవర్ అలీ ముగ్గురు కలిసి తన భర్త పాస్‌పోర్ట్, వీసా, ఇకామాలను తీసుకున్నారని, కొన్నిపత్రాలపై సంతకాలు, వేలిముద్ర తీసుకుని తప్పుడు పత్రాలతో బ్యాంకులో పర్సనల్ రుణం, క్రెడిట్ కార్డు తీసుకుని పారిపోయారన్నారు. వారికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చిందని తన భర్త తెలిపాడని చెప్పింది. దీంతో వెనక్కి తిరిగి రాలేక, డబ్బులు లేక 18 నెలలుగా స్నేహితుల వద్ద తల దాచుకుంటున్నాడని ఆవేదన చెందారు. ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా, కేంద్ర ప్రభుత్వం,సీఎం రేవంత్ రెడ్డి, స్పందించి గౌస్‌ను స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కష్టపడ్డారు.. అనుకున్నది సాధించారు

● సబ్‌కలెక్టర్లుగా ఎంపికైన పేదింటి బిడ్డలు ● డీఎస్పీలుగా పలువురు టీచర్లు ● వివిధ రాష్ట్రస్థాయి ఉద్యోగాలకు ఉమ్మడిజిల్లా అభ్యర్థుల ఎంపిక ● గ్రూప్-1 ఫలితాల్లో మెరిసిన మనోళ్లు

రాష్ట్రస్థాయి 6వ ర్యాంకు..


హర్షవర్ధన్

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన పూనాటి హర్షవర్ధన్(హాల్ టికెట్ నెం. 240911138) సబ్‌కలెక్టర్‌గా ఎంపికయ్యారు. గ్రూప్-1లో 525.5 మార్కులతో 6వ ర్యాంకు సాధించిచారు. పరీక్ష రాసిన హర్షవర్ధన్ ఆరో ర్యాంకుతో టాప్‌టెన్ జాబితాలో చోటు దక్కించుకున్నాడు. పట్టణంలోని సరస్వతినగర్‌కు చెందిన పూనాటి తిరుపతిరావు-రాజ్యలక్ష్మీ దంపతుల కుమారుడైన హర్షవర్ధన్ పదో తరగతిలో 568 మార్కులు, ఇంటర్‌లో 972 మార్కులు సాధించారు. అనంతరం హైదరాబాద్‌లోని బిట్స్ పిలానీలో ఇంజినీరింగ్(కంప్యూటర్ సైన్స్) విద్యను పూర్తి చేసి అమెజాన్‌లో ఆకర్షణీయమైన ప్యాకేజీతో కొలువుదీరాడు. కలెక్టర్ కావాలన్న లక్ష్యంతో యూపీఎస్సీ(ఐఏఎస్)కి ప్రిపేరైన హర్ష టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష రాసి 525.5 మార్కులతో ఆరో ర్యాంకు సాధించి సత్తాచాటాడు.

మారుమూల తండా నుంచి..


అశోక్

దామరచర్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాల్లో మండలంలోని దుబ్బతండాకు చెందిన తెజావత్ అశోక్‌నాయక్ సబ్ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. మారుమూల తండాకు చెందిన అశోక్‌నాయక్ తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. అశోక్‌నాయక్ 1 నుంచి 7వ తరగతి వరకు కొండ్రపోల్ నేతాజి హైస్కూల్‌లో, 8 నుంచి పదో తరగతి వరకు అవంతీపురం గిరిజన పాఠశాలలో, కోదాడ సనా కళాశాలలో పాలిటెక్నిక్‌ను పూర్తి చేయగా బీటెక్‌ను హైదరాబాద్ ధ్రువ కళాశాలలో పూర్తిచేశారు. అనంతరం సివిల్స్ లక్ష్యంగా గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన కోచింగ్‌లో శిక్షణ పొంది ఇటీవల విడుదలైన గ్రూప్-1లో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అశోక్‌నాయక్ మాట్లాడుతూ పేద ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మెడికల్ షాప్ యజమాని కుమార్తె డీఎస్పీ


రుచిత

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి పట్టణకేంద్రానికి చెందిన ఎల్లబోయిన రుచిత గ్రూప్-1 ఫలితాల్లో డీఎస్పీ ఉద్యోగాన్ని సాధించారు. మిర్యాలగూడ మండలం మొలకల పట్నం గ్రామానికి చెందిన ఎల్లబోయిన రవి, శోభ దంపతులు 30 ఏళ్ల క్రితం కొండమల్లేపల్లికి వచ్చి మెడికల్ షాప్‌ను నిర్వహిస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. తమ ఏకైక కుమార్తె రుచిత గ్రూప్-1 ఫలితాల్లో 502.5 మార్కులు సాధించి, డీఎస్పీగా ఎంపికయ్యారు. డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైన తమ కుమార్తెకు తల్లిదండ్రులు మిఠాయిలు తినిపించి ఆశీర్వదించారు.

సివిల్స్ సాధించడమే లక్ష్యం


సందీప్

తిరుమలగిరి: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రానికి చెందిన పత్తి సందీప్‌కుమార్ గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 257 ర్యాంకు సాధించి డీఎస్పీగా ఎంపికయ్యారు. అతని ఎంపికపై కుటుంబ సభ్యులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సివిల్ సాధించడమే తన లక్ష్యమని, డీఎస్పీగా ఎంపికైనందుకు ఆనందంగా ఉందని సందీప్ తెలిపారు. తండ్రి వెంకటాద్రి జనగామ జిల్లా కొడకండ్ల జడ్పీహెచ్ఎస్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, తల్లి లలిత అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు.

డిప్యూటీ కలెక్టర్‌గా మనోజ్ రెడ్డి


మనోజ్‌రెడ్డి

మునుగోడు రూరల్: మండలంలోని గూడపూర్ గ్రామానికి చెందిన నన్నూరి వెంకటరమణారెడ్డి విజయలక్ష్మి కుమారుడు మనోజ్‌రెడ్డి గ్రూప్-1 ఫలితాల్లో 11వ ర్యాంక్ సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. 2019 నుంచి సివిల్స్‌కు ప్రిపేర్ అవుతూ, గ్రూప్-1లో 11వ ర్యాంక్‌తో పాటు గ్రూప్-2లో 186 ర్యాంక్, గ్రూప్-3లో 337 ర్యాంక్ సాధించారు. తల్లి విజయలక్ష్మి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, తండ్రి నన్నూరి వెంకటరమణారెడ్డి వ్యవసాయం చేస్తారు.

ఉపాధ్యాయుడి నుంచి డీఎస్పీగా..


పి.రవి

నాగారం: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో మండలంలోని ఫణిగిరి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పి.రవి కుమార్ డీఎస్పీగా ఎంపికయ్యారు.ఈయన ప్రస్తుతం తుంగతుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే గ్రూప్-1 సాధించాలనే పట్టుదలతో నిరంతరం కష్టపడ్డారు. మొదటి ప్రయత్నంలోనే డీఎస్పీగా ఎంపికైనట్లు తెలిపారు.

తహసీల్దార్‌గా చేస్తూనే..


నాగార్జున్‌రెడ్డి

హుజూర్‌నగర్, తిరుమలగిరి(సాగర్): మొదటి ప్రయత్నంలోనే హుజూర్‌నగర్ తహసీల్దార్ గ్రూప్-1 అధికారిగా ఎంపికయ్యారు. మల్టీజోన్-2లో 37వ ర్యాంక్ సాధించి కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ ట్యాక్స్ అధికారిగా ఎంపికయ్యారు. 2023 నుంచి హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా నాగార్జునరెడ్డి బాధ్యతలు నిర్వహిస్తూనే గ్రూప్-1 పరీక్షల్లో 488 మార్కులు సాధించారు. నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలం బోయగూడెం గ్రామానికి చెందిన భగవంతరెడ్డి, జయమ్మ దంపతుల కుమారుడైన నాగార్జున్‌రెడ్డి 2013లో నిర్వహించిన గ్రూప్-2లో ఎంపికైన ఆయన ప్రస్తుతం తహసీల్దార్‌గా పనిచేస్తూనే గ్రూప్-1 పరీక్షలు రాసి కమర్షియల్ అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ ట్యాక్స్ అధికారిగా ఎంపికయ్యారు.

సివిల్స్‌కి ప్రయత్నించి..


నవీన్

ఉన్నత ఉద్యోగం సాధించాలనే తపన, పట్టుదలతో ఆ యువకుడు ఆరుసార్లు సివిల్స్‌కి ప్రయత్నించాడు. కాగా మొదటి ప్రయత్నంలోనే గ్రూప్-1 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి మునిసిపల్ కమిషనర్‌గా ఎంపికయ్యాడు హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన యరగాని నవీన్. పట్టణంలోని శ్రీనివాస థియేటర్ కాలనీకి చెందిన యరగాని గురవయ్య, జయలక్ష్మీల పెద్దకుమారుడు నవీన్ మొట్టమొదటి ప్రయత్నంలో గ్రూప్-1 సాధించాడు. ఢిల్లీలో కోచింగ్ తీసుకుని ఆరుసార్లు సివిల్స్‌కి ప్రయత్నించిన నవీన్ నాలుగుసార్లు మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించి ఇటీవల జరిగిన గ్రూప్-1లో ర్యాంక్ పొంది కమిషనర్‌గా ఎంపికయ్యారు.

184వ ర్యాంకుతో..


శ్రీజరెడ్డి

నార్కట్‌పల్లి: నల్లగొండ నార్కట్‌పల్లి మండలంలోని ఎనుగులదొరి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్రా శేఖర్‌రెడ్డి కుమార్తె నర్ర శ్రీజరెడ్డి మునిసిపల్ కమిషనర్‌గా ఉద్యోగం సాధించారు. గ్రూప్-1లో 474.5మార్కులతో 184వ ర్యాంకు సాధించిన శ్రీజరెడ్డి మునిసిపల్ కమిషనర్ పోస్టుకు ఎంపికయ్యారు. గతంలో జరిగిన గ్రూప్-4 పరీక్షల్లో మంచి ర్యాంకుతో సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నారు.

సబ్ జైలర్‌గా.. సతీష్


సతీష్

ఆత్మకూర్(ఎస్): ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రానికి చెందిన ఆవుల సతీష్ గ్రూప్-1 ఫలితాల్లో 467.5 మార్కులు సాధించి సబ్‌జైలర్‌గా ఎంపికయ్యారు. ప్రభుత్వం విడుదలచేసిన గ్రూప్-1 ఫలితాల్లో మొదటిసారిగా గ్రామం నుంచి విజయం సాధించారు. ఫైర్ ఏడీఎఫ్‌వోగా పనిచేస్తున్న ఆవుల వెంకన్న-ధనలక్ష్మీల ఏకైక పుత్రుడు సతీష్ గ్రూప్-1 ఉద్యోగం సాధించాడు.

మొక్కవోని దీక్షతో


కీర్తన

తిరుమలగిరి(సాగర్): నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన అల్లి కీర్తన గ్రూప్-1లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపీడీవోగా ఎంపికయ్యారు. మాజీ ఎంపీపీ అల్లి నాగమణి, పెద్దిరాజుల కుమార్తె అల్లి కీర్తన గతంలో రెండు ఉద్యోగాలు సాధించి ప్రస్తుతం వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో సైతం విజయం సాధించి, ఎంపీడీవోగా ఎంపికయ్యారు.

మెరిసిన పీఏపల్లివాసులు




పెద్దఅడిశర్లపల్లి: నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలం పెద్దగట్టు గ్రామంలోని సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన మూడావత్ బుజ్జి-శంకర్‌ల కుమారుడు వినోద్‌కుమార్ గ్రూప్-1లో మున్సిపల్ కమిషనర్ ఉద్యోగం సాధించారు. గుర్రంపోడ్ మండలం జిన్నాయిచింతకు ముడుసు శ్రీకాంత్ గ్రూప్-1లో డీఎస్పీ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం కేశంనేనిపల్లి గ్రామపంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్నారు.

కూలీ కుటుంబం నుంచి..


భవాని

అనంతగిరి: గ్రూప్-1 ఫలితాల్లో సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం వాయిలసింగారం గ్రామానికి చెందిన చట్టు భవాని డీఎస్పీగా ఎంపికయ్యారు. చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబరిచే భవాని ప్రస్తుతం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తూనే.. కష్టపడి చదివి గ్రూప్-1 సాధించారు.


సందీప్



నరేందర్


నిఖితారెడ్డి

పేదింటి విద్యా కుసుమాలు

సూర్యాపేట(కలెక్టరేట్): గ్రూప్-1లో ఇద్దరు యువకులు డీఎస్పీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. చివ్వెంల మండలం రోళ్లబండతండాకు చెందిన భీమ్లానాయక్ కుమారుడు నరేందర్ తెలంగాణ ట్రాన్స్‌కోలో 2018లో ఏఈగా ఉద్యోగం సాధించి ప్రస్తుతం హైదరాబాద్‌లో మౌలాలిలో గల 220 కేవీ సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం గ్రూప్-1లో డీఎస్పీగా ఎంపికయ్యారు. మరో యువకుడు పెన్‌పహాడ్ మండలం చినగారకుంటతండాకు చెందిన సైదానాయక్ కుమారుడు సందీప్ గ్రూప్-1లో డీఎస్పీగా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం తిరుమలగిరి మండలంలోని గుండెపురి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. కాగా ప్రభుత్వం విడుదల చేసిన ఫలితాల్లో గ్రూప్-1లో డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికయ్యారు. సూర్యాపేట పట్టణానికి చెందిన రంగారెడ్డి-లక్ష్మి దంపతుల కుమార్తె నిఖితారెడ్డి గ్రూప్-1లో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యారు.

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల నిలిపివేత


నీటి విడుదల నిలిపివేసిన ఎడమ కాలువ

నాగార్జునసాగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎడమ కాలువకు గురువారం ప్రాజెక్టు అధికారులు నీటివిడుదలను నిలిపివేశారు. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కాల్వ ఆయకట్టులో రైతులకు ప్రస్తుతం సాగునీరు అవసరం లేకపోవడంతో నీటి విడుదలను నిలిపివేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అంతేకాకుండా ఆయకట్టులో కురుస్తున్న వర్షాలతో పంటపొలాలు పడవకుండా కూడా రైతుల విన్నపం మేరకు కూడా నీటి విడుదలను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా సాగర్ ప్రాజెకు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312. 0450 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 586.70 అడుగులుగా (303.9495టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 9019 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,373 క్యూసెక్కులు, ఎస్ ఎల్‌బీసీ ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని, 26 క్రస్ట్ గేట్లలో 22 గేట్లను 5 అడుగుల మేరకు, 4 గేట్లను 10 అడుగుల మేరకు ఎత్తి 2,28,024 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.సాగర్ నుంచి మొత్తం 2,73,116 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 2,73,116 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మూసీ ప్రాజెక్టుకు వరద నీటి రాక కొనసాగుతోంది. 10 రోజులకు పైగా హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు మూసీ ఎగువ పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు భారీగా దిగువన గల మూసీ రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోంది. దీంతో మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిరంతరాయంగా కొనసాగుతోంది. బుధవారం సాయంత్రానికి 10,376.32 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా గురువారం సాయంత్రానికి కొంతమేర తగ్గి 7,836.40 క్యూసెక్కులగా నమోదైంది. దీంతో అధికారులు 2, 3, 4, 8, 10 నంబరు క్రస్ట్ గేట్లను రెండు అడుగులు ఎత్తి 7,9909.92 క్యూసెక్కులు, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు 383.76 క్యూసెక్కుల సాగునీటిని కలిపి మొత్తం 8,434.90 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు 645అడుగులు(4.46 టీఎంసీ)ల నీటినిల్వ సామర్థ్యం కాగా ప్రస్తుత నీటి మట్టం 643.42 అడుగులు(4.05టీఎంసీ)లుగా ఉంది.

వైభవంగా యాద‘గిరి’ప్రదక్షిణ

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి జన్మనక్షత్రం సందర్భంగా గురువారం సామూహిక గిరిప్రదక్షిణ వైభవంగా కొనసాగింది. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకుల వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులతో మంగళవాయిద్యాల నడుమ ఆలయ ఏఈవో గజ్వేల్లి రఘు, ఇతర అధికారులతో కలిసి ప్రదక్షిణ ప్రారంభించారు. గిరిప్రదక్షిణలో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయంలో అష్టోత్తర శతఘటాభిషేక పూజలు అర్చకులు చేపట్టారు. గిరిప్రదక్షిణలో స్వామివారిని స్తుతిస్తూ కోలాట నృత్యాలు, భజనలు, కీర్తనలతో కొండచుట్టూ రెండున్నర కిలోమీటర్ల మేర 45 నిమిషాలు మార్మోగింది. గిరిప్రదక్షిణలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీ‌ష్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ విప్ గొంగిడి సునీత, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ టెస్కాబ్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామక్రిష్ణారెడ్డితో పాటు పలువురు పార్టీ శ్రేణులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనం చేశారు. గిరిప్రదక్షిణ పూర్తి చేసి అనంతరం మెట్ల దారిలో కొండెక్కిన భక్తుల్లో 1,500 మందికి మాత్రమే ప్రత్యేక దర్శన క్యూలైన్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించేందుకు అనుమతించారు. అధిక సంఖ్యలో వాహనాలపై తరలిరావడంతో వైకుంఠద్వారం ఇరువైపులా రోడ్లు కిలోమీటరు మేర (కూడలి) నిండిపోయింది. వాహనాల పార్కింగ్‌తో ప్రదక్షిణ భక్తుల రాకపోకలకు అంతరాయం కలిగింది. మధ్యాహ్నం ఆరగింపు సమయం (12గంటలకు) వరకు సుమారు 28వేల మంది భక్తులు ప్రదక్షిణ పూర్తి చేసుకున్నారు. వైకుంఠద్వారం నుంచి ఆధ్యాత్మిక గీతాలు, కీర్తనలు, కోలాట నృత్యాలు దారి పొడవునా భక్తులను అలరింపజేయగా భజనలు, కీర్తనలతో దివ్య క్షేత్రం ప్రతిధ్వనించింది.


నదీ జలాల కలశంతో అర్చకులు, ఆస్థాన విద్వాంసులు

అష్టోత్తర శతఘటాభిషేక పూజలు

ఆలయంలో స్వామివారి స్వాతి జన్మనక్షత్రం పురస్కరించుకొని వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపి నిత్యారాధనలు జరిపిన అర్చకులు ఆస్థానపరంగా ఆరాధనల అనంతరం ఉత్సవమూర్తులకుహారతి నివేదించారు.

శివాలయంలో దేవీశరన్నవరాత్రోత్సవాలు

యాదగిరిగుట్ట దేవస్థానం అనుబంధ శివాలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయంలో నాలుగో రోజు గురువారం శ్రీలలితాదేవి అమ్మవారిని పూజారులు కొలిచారు. ఉదయం ప్రాతఃకాల పూజ అర్చనలు, పారాయణాలు, శ్రీదేవి మూలమంత్ర జపాలు, మధ్యాహ్నం చతుషష్టి ఉపచార పూజలు, నీరాజన మంత్ర పుష్పాలు, సాయంత్రం నవావరణ పూజలు, చతుషష్టి ఉపచార పూజలు, సహస్రనామార్చనలు, మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వినియోగం జరిగింది. కాగా స్వామివారికి వనపర్తికి చెందిన వేదవ్యాస్ గురువారం రూ. 1.30 లక్షల విలువ గల కిలో వెండి దేవస్థానానికి కలశాల నిమిత్తం అందజేశారు


గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు


గిరిప్రదక్షిణలో పాల్గొన్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీ‌ష్‌రావు, మాజీ విప్ గొంగిడి సునీత

రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు


బతుకమ్మలతో మాజీ ఎమ్మెల్యే సతీమణి కంచర్ల రమాదేవి, శైలజ, శోభ

నల్లగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో వైభవంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ని వివిధ కాలనీల నుంచి మహిళలు కళాత్మకమైన, ఆకర్షణీయమైన బతుకమ్మలను ఊరేగింపుగా తీసుకువచ్చి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా పలువు రు నాయకులు మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధించే సంస్కృతి తెలంగాణ ప్రజలదన్నారు. తెలంగాణ ఆడబిడ్డలు తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ ఉత్సవాలను సంప్రదాయ పద్ధతిలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. మహిళలు పోటీ పడి తీరొక్క పూలతో బతుకమ్మలను తీసుకువచ్చారు. బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలు తీసుకొచ్చిన బతుకమ్మలలో ఉత్తమమైన వాటిని గుర్తించి బహుమతులు అందజేశారు. అనంతరం ప్రత్యేక వాహనంలో బతుకమ్మలను తీసుకెళ్లి సమీప కాల్వలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, మహిళా సంఘం నాయకులు, రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్‌రెడ్డి, నా య కులు కొట్టం మధుసూదన్‌రెడ్డి, గుజ్జ జగన్‌మోహన్‌రెడ్డి, అలుగుబెల్లి రామిరెడ్డి, వంగాల అనిల్‌రెడ్డి, గాదె సైదిరెడ్డి, కోట్ల అశోక్‌రెడ్డి, కంచర్లకుంట్ల వెంకట్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

పరిశుభ్రత కోసం గంట సమయం కేటాయించాలి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ రోజుకు గంట సమయం కేటాయించాలని చౌటుప్పల్ మునిసిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రామ్‌రెడ్డి కోరారు. చౌటుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారి వెంట పడవేసిన చెత్తా, చెదారంతో పాటు వ్యర్థ పదార్థాలను దివీస్ సంస్థ కార్మికులు, మునిసిపల్ కార్మికులు సంయుక్తంగా గురువారం తొలగించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో దివీస్ జీఎం పి. సుధాకర్, మేనేజర్ అంజయ్య, ఆర్‌వో శ్రీధర్‌రెడ్డి, దివీస్ సంస్థ ప్రతినిధులు శివ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి


మునుగోడులో ముఖ్యనాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రజాసంక్షేమ, అభివృద్ధి పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో రిజర్వేషన్ల ఖరారు, ఎన్నికల్లో అనుసరించాల్సిన ప్రక్రియ అనే అంశంపై మునుగోడు క్యాంపు కార్యాలయంలో గురువారం నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి అక్రమాలతో ప్రజాధనం లూటీ చేసి అప్పుల భారం మోపిందని ఆయన ఆరోపించారు. ఈరకంగా ఛిద్రమైన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకుంటూనే ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తూ ముందుకు వెళ్తుందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల ఉచి త కరెంటు, రేషన్ కార్డుల పంపిణీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి వివిధ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు వివరంచారు. ఈపథకాలను ప్రజల ముందు ఉంచి స్థానిక ఎన్నికల్లో సానుకూలత వాతావరణంలో ప్రజాదారణ పొందాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈమేరకు ప్రజల మధ్యన ఉంటూ మద్దతు పొందాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలి


ఐలమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు పరిశీలిస్తున్న కొండూరు సత్యనారాయణ, తదితరులు

నల్లగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా శుక్రవారం (నేడు) తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 130వ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తుందని ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని ఐలమ్మ జయంతి ఉత్సవాల కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ కొండూరు సత్యనారాయణ కోరారు. జిల్లాకేంద్రంలోని సాగర్ రోడ్డులో రజక భవనం వద్ద ఐలమ్మ విగ్రహం వద్ద ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ు ఆమంచి అంజయ్య, చిలకరాజు చెన్నయ్య, దామర వేణు, చిలకరాజు సతీష్, సత్తయ్య, లక్ష్మయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఉంద్రుగొండ ఆలయంలో తెప్పోత్సవం



చివ్వెంల సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఉంద్రుగొండ గిరిదుర్గంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. అలాగే దుర్గామాత దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా లక్ష్మీనరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి స్వామి విగ్రహాలను స్థానిక చెరువులో తెప్పోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరై లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో టూరిజం శాఖ ఏడీఈ మణికంఠ, ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణ కుమార్, డాక్టర్ రామయ్య, కృష్ణమోహన్, శ్రీనివాస్, శ్రీరాములు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు యజమానులు నిబంధనలు పాటించాలి

మర్రిగూడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకు యజమానులు వినియోగదారులకు మౌలిక వసతులు కల్పించాలని లేకపోతే కేసు నమోదు చేస్తామని పౌరసరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్ హెచ్చరించారు. మండలకేంద్రంలోని పెట్రోల్ బంకులను గురువారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులకు మౌలిక వసతులు తప్పనసరిగా కల్పించాలని, తాగునీటిని, గాలి పంపులను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

గౌడ సంఘం శాలిగౌరారం అధ్యక్షుడిగా దేవేందర్

శాలిగౌరారం, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): గౌడసంఘం శాలిగౌరారం తూర్పుగంటి గ్రామ అధ్యక్షుడిగా బాలిశెట్టి గ్రామానికి చెందిన గుజాల్ దేవేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు దేవేందర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తన ఎన్నికకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి వెంకన్న

200 గజాల స్థలం స్వాధీనం

● బోర్డు పాతిన పంచాయతీ సిబ్బంది

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కొబ్బరికాయల వేలానికి సంబంధించి వేలం దారుడు చెల్లించాల్సిన డబ్బుల కింద జీపీకి మార్టిగేజ్ 200 గజాల స్థలాన్ని గురువారం స్వాధీనం చేసుకుని బోర్డును ఏర్పాటు చేసినట్లు మండలంలోని ఎల్లారెడ్డిగూడెం పంచాయతీ కార్యదర్శి చిరుమర్తి వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఒక సంవత్సరం కాలపరిమితికి కొబ్బరికాయల విక్రయ వేలం నిర్వహించగా వేలం మొత్తంలో కొంత నగదును చెల్లించగా మిగతా వేలం డబ్బుల కింద చేసిన 200 గజాల స్థలాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ స్థలాన్ని ఎవరైనా ఆక్రమించాలని చూసినా ప్రయత్నించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

దీన్‌దయాళ్ ఆశయాలు, స్ఫూర్తి మార్గదర్శకం

నల్లగొండ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దీన్‌దయాళ్ ఆశయాలు, స్ఫూర్తి తమ పార్టీకి మార్గదర్శకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ చేసిన కృషి మరువలేనిదని అన్నారు. రాజ్యాంగ ఫలాలు అందిరికీ అందించాలని ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు.

బీజేపీ జిల్లా కార్యాలయంలో పండింట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమంలో నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, గడ్డం మహేష్ పాల్గొన్నారు.

● జిల్లా కేంద్రంలో డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ద బ్లైండ్ ఆధ్వర్యంలో పండింట్ దీన్‌దయాళ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. అనంతరం డ్వాబ్ ప్రధాన కార్యదర్శి, ఏపీసీబీ ఉపాధ్యక్షుడు పొనుగోటి చొక్కారావు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డ్వాబ్ ఉపాధ్యాక్షుడు దేవిరెడ్డి లింగారెడ్డి, ఏ.యాదగిరి, ప్రకాశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధులను శాలువాలతో సన్మానించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



బీజేపీ కార్యాలయంలో దీన్ దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగం వర్షిత్‌రెడ్డి



దీన్‌దయాళ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డ్వాబ్ ప్రధాన కార్యదర్శి చొక్కారావు

● నల్లగొండ రూరల్: నల్లగొండ మండలంలోని వెలుగుపల్లి గ్రామంలో దీన్‌దయాళ్ విగ్రహానికి బీజేపీ మండల అధ్యక్షుడు బొగరి అనిల్‌కుమార్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, వెం కట్‌రెడ్డి, శంకర్, సాదర్ పాల్గొన్నారు.

● కేతేపల్లిలో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొక్కలను నాటారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పిట్ల వెంకట్, నాయకులు ఎ.అనితాగౌడ్, చెరుకు రోషయ్య, ఎస్.విజయలక్ష్మి, టీఎస్.చారి, వి.నాగయ్య, టి.అఖిల్, పి.రమేష్, రఘు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

● చిట్యాలరూరల్: చిట్యాల మండలం వనిపాకల గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు పీక వెంకన్న మాట్లాడుతూ దేశంపై ఆయనకు ఎంతో మమకారం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పీక మహేష్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కనగల్: పండిట్ దీన్‌దయాళ్ స్ఫూర్తిని ప్రతీ ఒక్కరూ కొనసాగించాలని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు వీరెల్లి చంద్రశేఖర్ కోరారు. కనగల్‌లో వేంకటేశ్వర స్వామి ఆలయంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో నాయకులు పాపిరెడ్డి, భిక్షం, వెంకన్న, శ్రీను, మధు, సరిత, భిక్షమాచారి, నరేందర్ పాల్గొన్నారు.

ఆహార పదార్థాల్లో శుభ్రత పాటించాలి



వీధి విక్రయదారులతో మాట్లాడుతున్న మెప్మా పీడీ శ్రీనివాసరావు

రామగిరి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ఆహార పదార్థాలు తయారు చేస్తూ పరిశుభ్రత పాటించి వినియోగదారుల మనస్సును చూరగొనాలని మెప్మా పీడీ శ్రీనివాసరావు కోరారు. ఆత్మనిర్భర్ నిధి కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో వీధి విక్రయదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వీధి విక్రయ వ్యాపారులకు తలకు టోపీ పెట్టుకొని, చేతులకు గ్లౌజులు వేసుకొని శుభ్రత పాటించాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఒకసారి వాడిన నూనెను తరచుగా వాడకూడదని, వ్యాపార ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యర్థాలను చెత్తబుట్టలో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్ శంకర్‌నారాయణ, మెప్మా టీఎంసీ శ్రీనివాస్, సీఈవోలు, వీధివిక్రయదారులు పాల్గొన్నారు.

కంటిచూపును కాపాడుకోవాలి : సీఐ



కంటి పరీక్షలు చేయించుకుంటున్న సీఐ నాగరాజు

చిట్యాలరూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కంటి చూపును కాపాడుకోవాలని నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు అన్నారు. సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో చిట్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిట్యాల మండలం వెలిమినేడులో గురువారం నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడా రు. కంటి సంరక్షణతో పాటుగా చూపునకు ప్రాధాన్యమివ్వాలని అన్నారు. ఏ పని చేయాలన్నా కళ్లతో చూడాలని, దానికి కంటి చూపు అవసరమన్నారు. క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకుని కళ్ల సంరక్షణ కోసం జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి విజన్ టెక్నీషియన్ దేవులపల్లి ఫ ణికుమార్, క్యాంప్ ఆర్గనైజర్ బాణాల వీరేందర్, స్థానిక క్లబ్ అధ్యక్షుడు జనగాం రవీందర్‌గౌడ్, కార్యదర్శి రేగులగడ్డ నర్సింహగౌడ్, కోశాధికారి కొల్లోజు శ్రీకాంత్, పం చాయతీ కార్యదర్శి తాటికొండ లింగస్వామి, మాజీ సర్పంచ్ దేశబోయిన మల్లమ్మపాపయ్య, పాటి మాధవరెడ్డి, పొన్నం లక్ష్మయ్యగౌడ్, పంతంగి కరుణాకర్‌గౌడ్, కంభంపాటి సతీష్, బాలగోని రాజుగౌడ్, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట మేరకు చెరువును నింపాం : ఎమ్మెల్యే



నార్కట్‌పల్లి చెరువుకు చీరసారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రాంత ప్రజలికిచ్చిన హామీ మేరకు నార్కట్‌పల్లి పెద్ద చెరువును ఉదయసముద్రం నీటితో నింపామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నీటితో నిండి అలుగుపోస్తున్న నార్కట్‌పల్లి పెద్ద చెరువుకు ఎమ్మెల్యే వీరేశం చీరసారె పుష్పాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నార్కట్‌పల్లి పెద్ద చెరువుకు చుక్క నీరు లేక ఎడారిగా కనిపించేదని కనీసం పశువుల దాహార్తి కూడా తీర్చలేకుండా ఉండేదన్నారు. చెరువును ఉదయ సముద్రం నీటితో నింపామని, దీంతో నార్కట్‌పల్లితో పాటు పరిసర గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయని అన్నారు. సాగు, తాగు నీటి సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, ఐతరాజు యాదయ్య, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, పుల్లెంల అచ్చాలు, నేతకాని కృష్ణయ్య, జెరిపోతుల భరత్, ఎస్‌కే సమద్, రాధారపు భిక్షపతి విజయలక్ష్మి, సల్లా వాసుదేవ్, వేముల సత్యం, జాల సైదులు, బోడ శంకర్, ఇడుకుళ్ల సంపత్, మాదాసు నర్సింహ, ముంత వెంకన్న, పల్లె నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు విడుదల చేయాలి

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరారెడ్డి

నల్లగొండరూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు వేతనాలు, బిల్లులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని దొడ్డి కొమురయ్య భవనంలో గురువారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులకు 5 నెలల బిల్లులు, 9 నెలల గుడ్ల బిల్లులు, వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దసరా పండుగ వరకైనా బిల్లులు వస్తాయని ఎదురుచూస్తున్న వారి ఆశలు నిరాశగా మారుతున్నాయని అన్నారు. పండుగ నాటికి బిల్లులు రాకపోతే కుటుంబం మొత్తం పస్తులు ఉండాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సైదులు, రవిందర్, ఖరీమున్నీసా, వసంత, రాజ్యలక్ష్మి, అరురాధ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ పండుగ



ముత్యాలమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల, నాయకుల పూజలు

కనగల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీఎడవల్లి గ్రామంలో ముత్యాలమ్మ ఆలయ వార్షిక వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గడ్డం అనూప్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు ఊరేగింపుగా బోనాలతో ఆలయానికి తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు సహదేవరెడ్డి, దోటి శ్రీను, ఐతగోని యాదయ్యగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. ఆయా కార్యక్రమాల్లో గడ్డం అనూప్‌రెడ్డి, కేసాని లింగారెడ్డి, కొరివి లింగయ్య, శంకర్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, సైదులు, విజయ్ తదితరులున్నారు.

శ్రామిక మహిళా జిల్లా సదస్సు విజయవంతం చేయాలి

కట్టంగూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కట్టంగూరులో ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న శ్రామిక్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పొడిచేటి సులోచన పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో సదస్సు కరపత్రాన్ని ఆశా వర్కర్లతో కలిసి ఆమె విడుదల చేసి మాట్లాడారు. భవన నిర్మాణం, ఇతర పారిశ్రామిక వాడల్లో పనిచేసే మహిళా కార్మికులకు సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లలో పనిచేసే గ్రామపంచాయతీ కార్మికులు, ఆశా, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ వీవోలకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తవిటి వెంకటమ్మ, శ్రామిక మహిళ సంఘం మండల కన్వీనర్ చెరుకు జానకి, ఆశా వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు చౌగోని ధనలక్ష్మి, కార్మికులు ఆశా వర్కర్లు శోభ, నర్సమ్మ, రేణుక, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

'శివన్నగూడ'లో షూటింగ్ సందడి



శివన్నగూడ రిజర్వాయర్ వద్ద చిత్రీకరణ చేస్తున్న దర్శకుడు

మర్రిగూడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సుర 59 సినిమా షూటింగ్ శివన్నగూడ రిజర్వాయర్ దగ్గరలో నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ పల్లేటి క్రియేషన్ డైరెక్టర్, ప్రొడ్యూసర్ పల్లేటి సుగ్రీవులు మా ట్లాడుతూ యువత పెడదారిన పడకూడదనే లక్ష్యంతో ఈ సినిమాను తీస్తున్నట్లు తెలిపారు. యువత గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోడైరెక్టర్ శివ నాగేందర్, ఆర్టిస్టులు విజయరాజు, బూరుగు నాగరాజు, గుప్త నరసింహ, కెమెరామన్లు తదితరులు పాల్గొన్నారు.

కాత్యాయని దేవిగా అమ్మవారు



మాన్యంచెల్కలో విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో) అమ్మవారు

నల్లగొండకల్చరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు కాత్యాయని దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. పట్టణంలో పలు మండపాల్లో అర్చకులు అమ్మవారిని ఎరుపు వస్త్రం, గులాబీ, తామరపూలతో అలంకరించి, బెల్లం అన్నం, ముద్దపప్పు అన్నం నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దీంతో అమ్మవారి మండపాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. భక్తులకు అన్నదానం చేశారు. మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, జీవి. యాదవ్, శ్రీనివాస్‌కాలనీ, పాతబస్తీ, హనుమాన్‌నగర్, శ్రీనగర్ కాలనీ, రాక్‌హిల్స్ కాలనీ, వీటీ కాలనీ, పద్మానగర్ కాలనీ, బొట్టుగూడ, ప్రకాశంబజార్ తదితర ప్రాంతాలలోని మండపాల్లో జరిగిన పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: చిట్యాల మండలంలోని గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో అమ్మవారి విగ్రహన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. మండలంలోని నేరడలో శ్రీమహమ్మాయి శ్రీశాంభవీదేవి ఆలయంలో అమ్మవారు శ్రీకాత్యాయనిదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రాతఃకాల అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారిని పురోహితులు పట్టువస్త్రాలు, పూలమాలతో అలంకరించారు. భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో హాజరై భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని ఆయుఃరారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు.

అమ్మవారి కృపతో సంతోషంగా ఉండాలి

మునుగోడు రూరల్: అమ్మవారి కృపతో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కోరారు. మునుగోడు మండలం కొంపల్లి గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమాతను దర్శించుకొని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

కనగల్: కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ ముఖ్య అర్చకులు నాగోజు మల్లాచారి ఆధ్వర్యంలో అర్చక బృందం సభ్యులు అమ్మ వారికి విశేషాలంకరణ చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో నాగిరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో మండపాల వద్ద అమ్మవారికి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

విద్యాప్రగతి కోసం టీఆర్‌టీఎఫ్ కృషి

● టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పిడి మల్లయ్య



నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న టీఆర్‌టీఎఫ్ నాయకులు

నల్లగొండరూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యాప్రగతి, సమాజ శ్రేయస్సు ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) పనిచేస్తుందని ఆ సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పిడి మల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఆర్‌టీఎఫ్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీఆర్‌టీఎఫ్ 80 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పో రాటాలు చేస్తుందని అన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎన్నో జీవోలను తీసుకువచ్చిందని అన్నారు. అనంతరం పలు మండలాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నల్లగొండ మండల అధ్యక్షుడిగా వడ్లకొండ సోమనర్సయ్య, ప్రధాన కార్యదర్శి ముడుసు శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా బొమ్ము కృష్ణ, కట్టంగూరు, నార్కట్‌పల్లి, తిప్పర్తి మండలాల అధ్యక్షులుగా చిట్టబోయి న లింగయ్య, కె.శేషగిరి, బెజవాడ సూర్యనారాయణలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు నిమ్మనగోటి జనార్దన్, తరాల పరమేష్‌యాదవ్, జిల్లా గౌరవ అధ్యక్షులు నంద్యాల మోహన్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు అర్రూరి జానయ్య, రాష్ట్ర కార్యదర్శి దొడ్డేని సాయిబాబు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జానయ్య, రాష్ట్ర కార్యదర్శి దొడ్డేని సాయిబాబు, నాయకులు పెండెం శ్రీనివాసులు, సైదులు, జలేందర్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ పరిస్థితుల వల్లే పత్తికి తెగులు



తెగులు సోకిన పత్తిని పరిశీలిస్తున్న ఏడీఏ వేణుగోపాలచారి

మర్రిగూడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితుల వల్లే పత్తికి ఎర్ర గుమ్మడి తెగులు సోకడం వల్ల ఎండిపోతుందని ఏడీఏ వేణుగోపాలచారి అన్నారు. మండలంలోని ఎరగండ్లపల్లి కొండూరు గ్రామాలలో పత్తి చేలను గురువారం ఆయన పరిశీలించారు. పత్తి మొక్క ఎదిగే సమయంలో అధికంగా యూరియా వేయడం, ఎండ తీ వ్రత వల్ల తేమ లేకపోవడంతో పత్తి పంట లు తెగుళ్లకు గురవుతాయన్నారు. రైతులు సరైన సమయంలో వ్యవసాయ అధికారుల సలహా సూచనలు తీసుకుంటే పత్తి పంటకు కొంత మేరకు తెగులు సోకకుండా నివారించడానికి అనుకూలంగా ఉండేదని అన్నారు. తెగులు సోకిన ఆకులు ఎండిపోవడం వల్ల కిరణజన్య సంయోగక్రియ తగ్గి దిగుబడి పడిపోతుందన్నారు. రైతులు మొదటి దశలో తెగులు నివారణ కోసం కార్బనైజింగ్, కాపర్ ఆక్సీ క్లోరైడ్ మొక్కల అడుగు భాగాల్లో చల్లితే కొంత మేరకు ఆకుముడత ఎర్ర తెగులు నివారించవచ్చని అన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు తప్పకుండా పాటిస్తే పత్తి మొక్కలకు తెగులు సోకకుండా నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి సహస్, ఏఈవో విజయ్ కుమార్ ఉన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమం ఆగదు

నాంపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులతో ఉద్యమం ఆగదని ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి అన్నారు. అంగన్‌వాడీ టీచర్స్ అం డ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ నేతలను పోలీసులు గురువారం అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని చలో సెక్రటేరియేట్‌కు పిలుపునివ్వగా పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని అన్నారు. అంగన్‌వాడీలకు సరైన వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో అంగన్‌వాడీ నాంపల్లి మండల టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు ఇందిర, సత్తెమ్మ, రాములు ఉన్నారు.

విద్యార్థులు ప్రతీ రోజూ కాలేజీకి రావాలి

● ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ బాలాజీ

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రతీ రోజు కాలేజీకి వచ్చి మంచి ఫలితాలు సాధించాలని ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ భీంసింగ్ అన్నారు. నార్కట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని గురువారం ఆయన సందర్శించారు. ఉత్తమ విద్యాబోధనతో స్ఫూర్తిదాయకమైన ఉత్తీర్ణత సాధన కోసం అధ్యాపకులు కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే పీటీఎం (పేరెంట్ టీచర్స్ మీటింగ్)లో భాగంగా నార్కట్‌పల్లి కాలేజీలో కూడా పీటీఎంను నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖాముఖి మాట్లాడాలని సూచించారు. కాలేజీ అభివృద్ధికి సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. గతంలో ఏ సీఎం కూడా ఇంటర్‌మీడియట్ స్థాయిలో పీటీఎంలు నిర్వహించాలని సూచించలేదని, కానీ రేవంత్‌రెడ్డి ఇంటర్ విద్యకు కూడా తగిన ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు. కాగా కాలేజీకి కనీస వసతులు కల్పించాలని అధ్యాపక బృందం చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని భీంసిం గ్ తెలిపారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ, నడింపల్లి వెంకటేశ్వర్లు, బోగ మమత, వీరమల్ల వెంకటేశ్, మండల అంజిబాబు, వీరమల్ల తేజస్విని, నడింపల్లి సంతోషిరాణి, అస్మా తదితరులు పాల్గొన్నారు.

మద్యం టెండర్లకు వేళాయె

(5వ పేజీ తరువాయి)



డ్రా తీస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఆసక్తి ఉన్న వారు 21 ఏళ్ల వయసు నిండి ఉండాలి. ఆధార్‌కార్డుతో పాటు, పాన్‌కార్డు తప్పనిసరి. అదేవిధంగా నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు దరఖాస్తుతో జతచేయాలి. రూ.3లక్షల విలువైన డిమాండ్ డ్రాఫ్టును (నాన్ రీఫండబుల్) అందజేయాలి. అదేవిధంగా గతంలో ఎక్సైజ్‌శాఖ పరిధిలో కేసులు ఉండకూడదు. కుష్టు లాంటి వ్యాధులు ఉండకూడదు.

డ్రా ద్వారా రిజర్వేషన్ కేటగిరీలకు దుకాణాల కేటాయింపు

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్లలో గురువారం సాయంత్రం ఎక్సైజ్‌శాఖ అధికారులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖల అధికారుల సమక్షంలో కలెక్టర్లు ఇలా త్రిపాఠి, తేజస్‌నందలాల్ పవార్, హనుమంతరావు డ్రా తీసి ఎస్సీ, ఎస్టీ, గౌడ్ సామాజికవర్గాలకే కేటాయించాల్సిన దుకాణాలను ఎంపిక చేశారు. ఈ డ్రా కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించే క్రమంలో మొత్తం వీడియో రికార్డింగ్ చేశారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల ఎక్సైజ్‌శాఖల అధికారులు బి.సంతోష్, లక్ష్మానాయక్, విష్ణుమూర్తి తదితర శాఖల అధికారులతో కలెక్టర్లు టెండర్ల ప్రక్రియపై సన్నాహక సమావేశం నిర్వహించి సూచనలు అందజేశారు.

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	586.70 (303.9495)	2,73,116	2,73,116
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.62 (4.10)	11,124.26	10,376.32
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	167.320 (34.6755)	3,68,435	3,82,670

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220

మద్యం టెండర్లకు వేళాయె



మద్యం దుకాణాలను సామాజికవర్గాల వారీగా కేటాయింపునకు కలెక్టరేట్‌లో నిర్వహించిన లాటరీలో టోకెన్ తీసి చూపుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- నేడు నోటిఫికేషన్, దరఖాస్తుల స్వీకరణ సైతం
- ఉమ్మడి జిల్లాలో ఏ-4 కేటగిరీ దుకాణాలు 329
- 2023లో దరఖాస్తుల ద్వారా రూ.305కోట్ల ఆదాయం
- ఈసారి దరఖాస్తులు పెరుగుతాయని అంచనా

జిల్లా	దుకాణాలు	ఎస్సీ	ఎస్టీ	గౌడ్స్	జనరల్
నల్లగొండ	154	14	04	34	102
సూర్యాపేట	93	10	03	27	53
యాదాద్రి	82	07	01	21	53
మొత్తం	329	31	08	82	208

నల్లగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొత్త మద్యం దుకాణాలు (ఏ-4 వైన్స్ దుకాణాలు) నిర్వహణకు ఎక్సైజ్‌శాఖ గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. 2025-27 సంవత్సరానికి శుక్రవారం నుంచి ఆసక్తిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుంటారు. అక్టోబరు 18 వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. వచ్చిన దరఖాస్తుల నుంచి అక్టోబరు 23న కలెక్టర్ సమక్షంలో డ్రా నిర్వహించి దుకాణాలను కేటాయిస్తారు. ఈ టెండర్లలో ఎంపికయ్యేవారు ఈ ఏడాది డిసెంబరు 1వ తేదీ నుంచి 2027 నవంబరు 31 వరకు దుకాణాలను నిర్వహించుకునేందుకు అనుమతి ఉంటుంది. ఎక్సైజ్‌శాఖ టెండర్లలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులను ఆయా జిల్లా కేంద్రాల్లోని ఎక్సైజ్ కార్యాలయాలతో పాటు, నాంపల్లిలోని ఎక్సైజ్‌శాఖ ప్రధాన కార్యాలయంలోనూ శుక్రవారం నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు అందజేయవచ్చు. ప్రభుత్వ విధానం మేరకు అన్ని జిల్లాల్లో మద్యం దుకాణాల్లో ఎస్సీ, ఎస్టీ, గౌడ్ (బీసీ) కులస్థులకు రిజర్వేషన్ ఉంటుంది. అందుకు గురువారం ఆయా జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు డ్రా తీసి కేటాయింపు చేశారు.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 329 మద్యం దుకాణాల్లో 8 ఎస్టీలకు, 31 ఎస్సీలకు, 82 జనరల్ కేటగిరీకి కేటాయించారు. మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేవారు రూ.3లక్షల విలువైన డిమాండ్ డ్రాఫ్టును రుసుముగా చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులకు టెండరు దక్కినా దక్కపోయినా ఈ దరఖాస్తు రుసుము వెనక్కిరాదు. రెండేళ్ల క్రితం జరిగిన టెండర్లలో దరఖాస్తు రుసుము రూ.2లక్షలు ఉండగా, ఈసారి రూ.1లక్ష పెంచారు. దరఖాస్తు రుసుము పెంచినప్పటికీ ఈసారి మద్యం దుకాణాలకు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్‌శాఖ అంచనావేస్తోంది.

- 2023లో ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన టెండర్లలో 15,256 దరఖాస్తులు వచ్చాయి. అప్పుడు కేవలం దరఖాస్తుల నుంచే రూ.305.12కోట్ల ఆదాయం ఎక్సైజ్‌శాఖకు సమకూరింది. ఈసారి దరఖాస్తుల రుసుము రూ.లక్ష అదనంగా పెంచినా దరఖాస్తులు కూడా ఎక్కువగా వస్తాయని భావిస్తున్నారు. దరఖాస్తుల ద్వారా కనీసంగా రూ.500 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు.
- మద్యం దుకాణానికి దరఖాస్తు చేయాలనుకునే

మిగతా 8వ పేజీలో...

ఆరు శ్లాబులుగా లైసెన్స్ ఫీజు



రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలకు ఆరు శ్లాబులుగా లైసెన్స్ ఫీజును నిర్ణయించారు. 5వేల లోపు జనాభా ఉన్న దుకాణాలకు లైసెన్స్ ఫీజును రూ.50లక్షలుగా నిర్ధారించారు. 5,001 నుంచి 50వేల జనాభా ఉన్న మద్యం దుకాణాలకు ఫీజు రూ.55లక్షలు, 50,001 జనాభా నుంచి 1లక్ష జనాభా ఉన్న మద్యం దుకాణానికి రూ.60లక్షల ఫీజు ఖరారు చేశారు. 1లక్ష నుంచి 5లక్షల వరకు మద్యం దుకాణం ఫీజును రూ.65లక్షలుగా, 5నుంచి 20లక్షల జనాభా ఉన్న మద్యం దుకాణాలకు రూ.85లక్షలుగా నిర్ధారించారు. 20లక్షల పైబడి జనాభా ఉన్న మద్యం దుకాణాలకు లైసెన్స్ ఫీజు రూ.1.10కోట్లుగా నిర్ధారించారు. ఉమ్మడి జిల్లాలో రూ.60లక్షల లైసెన్స్ ఫీజు దుకాణాల వరకే ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో రూ.60లక్షల శ్లాబులో 40 దుకాణాలు, రూ.55లక్షల శ్లాబులో 88 దుకాణాలు, రూ.50లక్షల శ్లాబులో 26 దుకాణాలు ఉన్నాయి.

రాష్ట్రాన్ని నెంబర్‌వన్‌గా నిలపడమే లక్ష్యం

- పేదలకు సేవలందిస్తా
- గ్రూపు -1 రాష్ట్ర సెకండ్ ర్యాంకర్ దాడి వెంకటరమణ



రాష్ట్రస్థాయి రెండో ర్యాంక్ సాధించిన నల్లగొండకు చెందిన వెంకటరమణ

నల్లగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలు, విద్యార్థులు, బడుగు, బలహీన వర్గాలకు సేవ చేయాలన్న తపన నల్లగొండకు చెందిన దాడి వెంకటరమణను గ్రూప్-1లో రాష్ట్ర రెండో ర్యాంకర్‌గా నిలబెట్టింది. సివిల్స్ సర్వీసెస్‌కు సన్నద్ధమవుతూనే టీజీపీఎస్సీలో గ్రూప్- 1 పరీక్ష రాసి 535.5 మార్కులతో రాష్ట్ర రెండో ర్యాంకు సాధించాడు. జిల్లా కేంద్రం నల్లగొండకు చెందిన దాడి వెంకటరమణ ఆరేళ్లు కష్టపడి చదివి విజయం సాధించాడు. ఆయన విజయం వెనుక తల్లిదండ్రుల కృషి, సహకారం ఎంతగానో ఉంది. వెంకటరమణ తండ్రి శ్రీనివాసరావు ఈడబ్ల్యూఐడీసీలో ఉద్యోగం చేస్తుండగా, తల్లి రమాదేవి విద్యాశాఖలో ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. అంతకుముందు మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు వెంకటరమణ ఎంపికయ్యారు. డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా, జూనియర్ లెక్చరర్‌గా, గ్రూపు -2లో 378 ర్యాంకును సాధించాడు. గ్రూప్ -1 లో రాష్ట్ర సెకండ్ ర్యాంకు సాధించడంతో డిప్యూటీ కలెక్టర్ పోస్టు వచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర రెండో ర్యాంకు సాధించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత 2022లో ఇచ్చిన మొదటి గ్రూపు - 1 నోటిఫికేషన్‌లో ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందన్నారు. పది మందికి ఉపయోగపడలన్నాదే తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. ప్రైవేట్ స్టడీ సెంటర్‌లో ఉదయం 8 నుంచి రాత్రి 12.30 గంటల వరకు చదివేవాడినని, ప్రతీ సబ్జెక్టు సంబంధించి ప్రత్యేకంగా ఒక నోట్స్ ఉండేదన్నారు. తెలంగాణను నెంబర్‌వన్‌గా నిలపడమే తన ముందున్న లక్ష్యమన్నారు. ఎవరికైనా ప్రతీసారి సక్సెస్ అనేది రాకపోవచ్చని, నిరుత్సాహపడకుండా కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని వెంకటరమణ అన్నారు.

కష్టపడ్డారు.. సాధించారు

ఉమ్మడి జిల్లా వాసులకు ర్యాంకుల పంట 7

నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఎమ్మెల్యే బాలునాయక్

ఎస్పీ శరత్‌చంద్రపవార్, ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, ఏఎస్పీ మౌనికతో కలిసి దేవరకొండలో అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేసిన 100 సీసీ టీవీ కెమెరాలను ప్రారంభించి మాట్లాడారు. ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీస్ సిబ్బందితో సమానమని, వీటిని ప్రతీ ప్రాంతంలో ఏర్పాటు చేయడం ద్వారా నేర రహిత సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. దేవరకొండ పట్టణంతోపాటు గుర్రంపోడు మండల కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్‌స్టేషన్లకు అనుసంధానం చేసి కమాండ్ కంట్రోల్‌రూంను ప్రారంభించినట్లు తెలిపారు. వీటి ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే బాలునాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ, పట్టణంలో నేర నియంత్రణకు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పట్టణంలోని అన్ని ప్రధాన కూడలీలు, కాలనీల్లో వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి, సీఐ వెంకట్‌రెడ్డి, కొండమల్లేపల్లి సీఐ నవీన్, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎస్ఐలు మధు, నారాయణరెడ్డి, మౌనిక, సాలకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఓట్ చోర్' సంతకాల సేకరణ

ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

నల్లగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓట్ చోర్‌పై జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి సంతకాల సేకరణ చేపట్టనున్నట్టు ఎమ్మెల్సీ, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ తెలిపారు. గురువారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఓట్ చోర్‌పై ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. అయినా ఎన్నికల కమిషన్ కేంద్రానికి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీహార్, మహారాష్ట్రలో ఓట్ల తొలగింపునకు పాల్పడిందని ఆరోపించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు బీజేపీ ఓట్ చోర్‌పై జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయి వరకు సంతకాల సేకరణ చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ శ్రేణులంతా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావాలి

బీజేపీ రాష్ట్ర నేత శ్రీనివాస్‌గౌడ్



మొక్క నాటుతున్న బీజేపీ నేత శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండటౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వికసిత భారత్ లక్ష్యంగా ప్రజలంతా స్వదేశీ వస్తువులు వినియోగిస్తూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర నేత మాదగోని శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాల్ జన్మదిన సందర్భంగా పానగల్ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పండిట్ దీన్‌దయాల్ సమాజంలోని అట్టడుగు వర్గాల వారికి ప్రభుత్వ ఫలాలు దక్కేలా పార్టీ మూల సిద్ధాంతం ఉండాలని పాటుపడ్డారన్నారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో బీజేపీ దేశవ్యాప్తంగా పలు సంక్షేమ పథకాలను పేద మధ్యతరగతి వర్గాల కోసం అమలుచేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మిర్యాల వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షుడు ఫకీర్ మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, మిరియాల గిరి, పిన్నింటి నరేందర్‌రెడ్డి, మంగళపల్లి కిషన్, కట్టకం శ్రీధర్, గుగులోత్ తార, బద్దం నగేష్, శశిధర్, పాల్గొన్నారు.

యంగ్ ఇండియా స్కూల్ పనులు ప్రారంభించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

మునుగోడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని సర్వే నెంబర్ 78లో కేటాయించిన స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల స్థలం, అక్కడికి వెళ్లే రహదారి, పరిసరాలను ఆమె పరిశీలించారు. వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్ని వర్గాల విద్యార్థులు ఒకే చోట విద్య అభ్యసించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. నిబంధనల ప్రకారం అన్ని హంగులతో నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజలు, రైతులు సమస్యల పరిష్కారం కోసం చేసిన దరఖాస్తులతో పాటు 'ప్రజావాణి' ద్వారా చేసుకున్న ఫిర్యాదులను పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం మునుగోడు తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. భూభారతి దరఖాస్తులు, సమస్యలు, దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీదేవి, మునుగోడు ఇన్‌చార్జి తహసీల్దార్ నేలపట్ల నరేష్, ఎంపీడీవో యుగంధర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జున్‌రావు, గిర్దావర్ వంశీ, సర్వేయర్ నాగేశ్వరావు, తదితరులు ఉన్నారు.



నల్లగొండ ఎన్జీ కళాశాల మైదానంలో రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ ఆడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

జిల్లాకు జాతీయ పురస్కారం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్ సంచయ్ జౌర్ జన్ భాగీదారీ ప్రతిష్ఠాత్మక జాతీయ పురస్కారానికి జిల్లా ఎంపికైంది. ఈ పురస్కారానికి నల్లగొండ, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలను కేంద్రం ఎంపిక చేసింది. దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాలు పోటీపడగా తొలి మూడు స్థానాలను తెలంగాణ జిల్లాలే దక్కించుకున్నాయి. ఈ పురస్కారం కింద కేంద్రం రూ.2కోట్లు ఇవ్వనుంది. ఈ మేరకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో అభినందించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి హామీ సిబ్బంది కృషి ఫలితంగానే జాతీయ పురస్కారం దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు.

యువకుడిని కొట్టామనడం అవాస్తవం

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వాడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామరచర్ల మండలం కొత్తపేటతండాకు చెందిన యువకుడు సాయిసిద్ధును యూరియా కోసం జరిగిన ధర్నాల్లో పాల్గొన్నాడనే కారణంతో పోలీసులు కొట్టారని చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పేర్కొన్నారు. సాయిసిద్ధుకు సంబంధించిన కేసులు, వాటిపై వాడపల్లి పోలీసులు చేసిన విచారణ వివరాలను ఎస్పీ బుధవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు.

సాయిసిద్ధు, అతడి స్నేహితుల మధ్య ఘర్షణలపై నమోదైన కేసుల్లోనే ఈ నెల 9వ తేదీన పూర్తి వైద్యపరీక్షలు నిర్వహించి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. సాయిసిద్ధు, సుమన్ స్నేహితులు కాగా, వీరిద్దరు ఇతర స్నేహితులతో కలిసి గ్రామం చివర ఆరుబయట మద్యం తాగుతారని తెలిపారు. ఆ క్రమంలోనే ఈ నెల 2న సాయిసిద్ధు, అతడి సోదరుడు నవీన్, స్నేహితుడు సుమన్, మరోవ్యక్తి కలిసి ఊరి బయటకు వచ్చారని, అక్కడ మాటామాటా పెరిగి వారి ఘర్షణ పడ్డారన్నారు. ఈ ఘర్షణలో సుమన్ చేసిన దాడితో సాయిసిద్ధు, అతడి సోదరుడు నవీన్ తలకు గాయమైందని తెలిపారు. అక్కడ తగాదా ముగిశాక ఎవరిళ్లకు వారు వెళ్లిపోయారని, అయితే దీన్ని మనసులో పెట్టుకొని అదేరోజు రాత్రి సాయిసిద్ధు, నవీన్ కలిసి సుమన్ ఇంటికి వెళ్లి అతని గురించి వెతికారన్నారు. సుమన్ ఇంట్లో లేడని తెలిసి అతడి తల్లిదండ్రులపై దాడిచేశారని తెలిపారు. ఈ దాడిలో సుమన్ తల్లికి ముక్కుకు గాయాలవగా, తండ్రికి పక్కటెముకలు విరిగాయని తెలిపారు. ఈ ఘర్షణల నేపథ్యంలో ఇరువర్గాలపై రెండు వేర్వేరు కేసులు వాడపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదయ్యాయని చెప్పారు. ఈ కేసు నేపథ్యంలోనే ఈనెల 9వ తేదీన సాయిసిద్ధు, నవీన్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్పీ వివరించారు. అయితే ఈనెల 3న మిర్యాలగూడ పట్టణంలోని చింతపల్లి క్రాస్ రోడ్డు వద్ద యూరియా కోసం జరిగిన ధర్నాలో సాయిసిద్ధు పాల్గొన్నందుకే పోలీసులు స్టేషన్‌కు తరలించి కొట్టారని ఆరోపించడం పూర్తి అవాస్తవమని ఎస్పీ పేర్కొన్నారు. 2న జరిగిన ఘర్షణకు సంబంధించిన కేసులోనే సాయిసిద్ధుకి పూర్తి వైద్యపరీక్షలు చేయించి, పూర్తి ఆధారాలతో రిమాండ్‌కు తరలించామని వివరించారు. నేరాల నియంత్రణకు పోలీస్‌శాఖ నిరంతరం కృషి చేస్తోందని, పోలీస్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఎవ్వరూ వ్యవహరించవద్దని ఎస్పీ శరత్‌చంద్రపవార్ సూచించారు.

ఉపాధి కూలీలకు సురక్ష బీమా యోజన

డీఆర్డీవో శేఖర్‌రెడ్డి



వేములపల్లి మండలంలో ఈ-కేవైసీ నమోదును పరిశీలిస్తున్న డీఆర్డీవో శేఖర్‌రెడ్డి

మిర్యాలగూడ అర్బన్/వేములపల్లి సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద జాబ్‌కార్డు ఉన్న కూలీలకు పీఎం సురక్ష బీమా యోజన వర్తించేలా చర్యలు తీసుకుంటున్నామని డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మిర్యాలగూడ, వేములపల్లి మండలాల్లో ఈ-కేవైసీ నమోదును ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జాబ్ కార్డు ఈ-కేవైసీ చేయించుకోవడం ద్వారా బీమా లబ్ధిచేకూరుతోందన్నారు. ఇప్పటికే జిల్లాలోని 3.38లక్షల జాబ్‌కార్డులకు ఆధార్ సీడింగ్ పూర్తిచేశామన్నారు. ఆయా జాబ్‌కార్డుల్లో నమోదైన 7.30లక్షల మంది కూలీల ఈ-కేవైసీ నమోదు చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియను ఫీల్డ్ అసిస్టెంట్లు వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేశారు. ఈ-కేవైసీ చేయించుకున్న కూలీలకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన ద్వారా రూ.2లక్షల బీమా వర్తిస్తుందన్నారు. దీనికి ఏటా రూ.20 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. రుణాల వసూలులో వేములపల్లి, నకిరేకల్, చండూరు మండలాలు ముందువరుసలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ నర్సింహారావు, ఎంపీడీవోలు జితేందర్‌రెడ్డి, ఎంఎస్.శర్మ, ఏపీవోలు సూరానాయక్, మిరాజ్‌అలీ, పంచాయతీకార్యదర్శులు శ్రవన్‌కుమార్, రాజశేఖర్, ఏపీఎం జానకి, దిలీప్‌కుమార్, సీసీ గోపి, సీవో ప్రసాద్, సీసీ శ్రీను, మిస్కిన్, టీఏలు పావని, కళ, రమణ, ఎఫ్ఏలు తులసి, మధు, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణ సక్రమంగా ఉండాలి

(ఆంధ్రజ్యోతి, దామరచర్ల): నర్సరీల నిర్వహణ సక్రమంగా ఉండాలని డీఆర్‌డీవో వైశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వాడపల్లి, కొండ్రపోల్ గ్రామాల్లోని వన నర్సరీలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. అనంతరం ఉపాధిహామీ కూలీల ఈ-కేవైసీ విధానాన్ని పరిశీలించారు. ఆయన వెంట క్లస్టర్ ఏపీడీ బాలకృష్ణ, తదితరులు ఉన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్

కేటీఆర్‌ను ఎర్రగడ్డలో చేర్చాలి

ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా విశ్వాసం కోల్పోయి అధికారానికి దూరమైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను చూస్తే ఆయన మతి భ్రమించిందని అర్థమవుతోందని, ఆయన్ను ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేర్చాలని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే గన్‌మెన్ లారీ యూరియా మాయం చేశాడని, ఎమ్మెల్యే గౌదాములోని యూరియాను ఖతం చేశాడని కేటీఆర్ వ్యాఖ్యానించడం మతిస్థిమితం లేని చర్య అని అన్నారు. దామరచర్ల మండలం కొత్తపేటలో ఇద్దరు తాగి ఘర్షణపెట్టుకుంటే యూరియా ధర్నాకు వెళ్లినందుకు పోలీసులు కొట్టారని రాజకీయ గుంపును వేసుకుని జగదీష్‌రెడ్డి పరామర్శల యాత్ర చేయడం విడ్డూరమని విమర్శించారు. యూరియా ధర్నా చేసింది ఎక్కడ? కేసు పెట్టింది ఎక్కడ? ఏమైనా సంబంధం ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రజాపాలనను చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వలేక విమర్శలు చేస్తూ ప్రజల్లో మరింత పలచనవుతున్నారని అన్నారు. కేటీఆర్‌ను ఎర్రగడ్డకు, చోటా నేతలను ఉస్మానియాకు పంపించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రశ్నించినవారిపై కేసులు పెట్టి, మీడియాపై కూడా నిర్బంధం విధించిన వారు పరామర్శల పేరుతో రాజకీయ యాత్రలు చేస్తున్నారని విమర్శించారు. ఈ విధానాన్ని మార్చుకోకపోతే ప్రజాక్షేత్రంలో మరింత భంగపాటు తప్పదని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు స్కైలాబ్‌నాయక్, చిరుమర్రి కృష్ణయ్య, పగిడి రామలింగయ్య, గాయం ఉపేందర్‌రెడ్డి, పొదిల శ్రీనివాస్, తలకొప్పుల సైదులు, వెంకటేశ్‌గౌడ్, సిద్దూనాయక్, తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి లతీఫుల్లాషా ఖాద్రి ఉర్సు

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని హజ్రత్ సయ్యద్ లతీఫుల్లాషా ఖాద్రి దర్గా ఉర్సు ఉత్సవాలు అక్టోబరు 9వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని దర్గా మెట్ల వద్ద ఉర్సు ఉత్సవ కమిటీ, దర్గా ఇనాందార్ ముతవల్లుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్టోబరు 9న సాయంత్రం మదీనా మసీదు నుంచి గంధం ఊరేగింపు ప్రారంభమై దర్గా మెట్ల వద్దకు చేరుకుంటుందన్నారు. 10న దీపాలంకరణ, 11న రాత్రి కళాకారుల ఖవ్వాలి ఉంటుందన్నారు. ఉర్సు ప్రధాన ఘట్టాలు మూడు రోజులే ఉన్నా, భక్తుల దర్శనాలతో నెల రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తామన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచే గాక, ఇతర రాష్ట్రాల నుంచి కూడా హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పిస్తామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక చొరవతో దర్గా ఘాట్ రోడ్డు పనులు ప్రారంభించినా, కొందరు రాజకీయ దురుద్దేశంతో అడ్డంకులు కల్పిస్తున్నారని విమర్శించారు. అనంతరం ఉర్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఈ అశోక్, మాజీ కౌన్సిలర్లు నవీన్‌గౌడ్, ఇంతియాజ్, ఇబ్రహీం, ఉర్సు కమిటీ వైస్ ప్రెసిడెంట్ సయ్యద్ ఖాజా గౌస్ మోహినుద్దీన్, సీపీఎం నేత హాశం, మసి, ఇంతియాజ్ హుస్సేన్, దర్గా ఇనాందార్ ముతవల్లులు సమీఉల్లా ఖాద్రి, గౌస్ ఉల్లా ఖాద్రి, జమాల్‌ఖాద్రి, ఉబేద్‌ఖాద్రి, సల్మాన్ ఖాద్రి, అవైయిస్ ఖాద్రి, తబరేస్ ఖాద్రి, సమద్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

మిర్యాలగూడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య కోరారు. ఈ మేరకు గురువారం ఏఐకెఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌కు వినతిపత్రం అందజేశారు. పార్మర్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్ లేకపోయినా పత్తిని కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌నాయక్, జి.మారయ్య, వస్కుల సైదమ్మ, కాశి, కిరణ్, గణేష్, మౌనిక, ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

సాహితీ పురస్కారానికి తడకమళ్ల ఎంపిక

మిర్యాలగూడటౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ నటుడు, నాటక రచయిత, కవి తడకమళ్ల రాంచందర్‌రావు కిన్నెర-చిలకమర్రి సాహితీ పురస్కారానికి ఎంపికయ్యారు. చిలకమర్రి లక్ష్మీనర్సింహ, మల్లయ్యశాస్త్రి జయంతి సందర్భంగా సాహితీ పురస్కారాలు అందజేయనున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం నిర్వహించనున్న సమావేశంలో రాంచందర్‌రావుకు సాహితీ పురస్కారాన్ని అందజేయనున్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

హాలియా,సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని హాలియా మునిసిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి అన్నారు. స్థానిక పేరూరు రోడ్డు మైనర్ కెనాల్ వద్ద స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పండిట్ దీన్ దయాళ్ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని హాలియా పురపాలక సంఘంలో ఏక్ దిన్ ఏక్ గంటా ఏక్ సాత్ స్వచ్ఛతా ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పట్టణ అభివృద్ధి పరిశుభ్రత, పచ్చదనం, ప్లాస్టిక్ రహిత పట్టణం బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పర్యావరణ ఇంజనీర్ రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సురేష్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



సురేష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

అడవిదేవులపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీలకర కుంటతండాకు చెందిన కొర్ర సురేష్ మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గురువారం గ్రామంలో సురేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు స్కైలాబ్‌నాయక్, పొదిల శ్రీనివాస్, బాలునాయక్, బండి నాగేశ్వర్‌రావు, పసుపులేటి శ్రీనివాస్, కొర్ర అశోక్ తదితరులు ఉన్నారు.

గిరిజన యువకుడిని కొట్టడం సరికాదు

దామరచర్ల, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొత్తపేటకు చెందిన గిరిజన యువకుడు సాయిసిద్ధును పోలీసులు విచక్షణ రహితంగా కొట్టడం చట్టరీత్యా నేరమని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా ఎర్రనాయక్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ సాయిసిద్దు ఏమైనా తప్పు చేసి ఉంటే కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించాలని అంతేకాని కొట్టడం సరైందికాదన్నారు. కార్యక్రమంలో పాపానాయక్, రవినాయక్, వినోద్ నాయక్, నాగేశ్వర్‌రావు, కాంతారావు, హనుమంతునాయక్, విజయ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి విధానంతో అధిక దిగుబడి

మాడ్గులపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సాగులో తడి, పొడి విధానంతో రైతు లు అధిక దిగుబడులు సాధించవచ్చని వివేకానంద గ్రామీణ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఎండీ .గౌస్‌మియా అన్నారు. మండలంలోని గుర్రప్పగూడెం గ్రామంలో గురువారం రైతులకు తడి,పొడి విధానంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గ్రామంలో తడి, పొడి విధానం రైతులకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో అమలు పరుస్తున్న రైతులకు ప్రోత్సాహకంగా రూ.1.88లక్షల చెక్కులను అందజేశారు. ప్రతి ఒక్కరూ తడిపొడి విధానం సాగుపై దృష్టి సారించి అధిక లాభాలు గడించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీఎస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కార్తీక్, నీరజ, బీష్మ్‌సింగ్, పాండు, ఏవో శివరాంకుమార్, సంస్థ సభ్యులు, రైతులు కట్టా కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, జాన్‌రెడ్డి, గాలయ్య, అంజన్‌కుమార్, నాగయ్య, శ్రీను పాల్గొన్నారు.


వీధి వ్యాపారులకు అండగా నిలవాలి



మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శివాజీ

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులకు అండగా నిలవాలని మెప్మా జిల్లా కోఆర్డినేటర్ శివాజీ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఉద్యోగులకు సూచించారు. మునిసిపల్ కార్యాలయంలో లోక కల్యాణ మేళాపై గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిరు వ్యాపారాలను ప్రోత్సహిస్తూనే ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆహార శుభ్రత అంశంపై వీధి వ్యాపారులకు మెప్మా ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శుభ్రత లేని ఆహారంతో పాటు, తినుపదార్థాల్లో యదేచ్ఛగా కల్తీ జరుగుతున్న తరుణంలో కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో లచ్చీరాం, టీఎంసీ బక్కయ్య, శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

డిండి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేపీ నాయకులు గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు గురువారం చీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా దేవరకొండ నియోజకవర్గ కన్వీనర్ ఏటి కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు వానం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ సేవా పక్వాడ్ కార్యక్రమంలో చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. చిట్టచివరి వ్యక్తికి సంక్షేమ ఫలాలు అందిననాడే నిజమైన స్వాతంత్ర్యమని పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అన్నారని వారు తెలిపారు. ఈ సందర్భంగా షిర్డిసాయి మందిరంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సింకారు సైదా, రాధిక, సాయిగౌడ్, రాఘవేందర్, శ్రీను, అమృత్, కటికర్ల అంజి, వావిళ్ల శ్రీశైలం, పోలం సాయి, అనిల్, సందీప్ పాల్గొన్నారు.

దీన్‌దయాల్ ఆశయాలు సాధించాలి

● ఘనంగా పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి ● పలు మండలాల్లో చిత్రపటానికి నివాళులర్పించిన బీజేపీ నాయకులు



మిర్యాలగూడ: దీన్‌దయాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాధినేని తదితరులు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాసరావు అన్నారు. దీన్‌దయాల్ జయంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాధినేని మాట్లాడుతూ భారతీయ తత్వవేత్త, శాస్త్రవేత్త దీన్‌దయాల్ జీవితగాథ తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. ధర్మం కోసం అహర్నిశలు పాటుపడుతూనే భారతీయ జనసంఘ్‌ను కాపాడిన ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలుస్తారన్నారు. అనంతరం పార్టీ నాయకులు, అనుబంధ సంఘాలతో కలిసి స్వచ్ఛభారత్ నిర్వహించిన పలు వార్డుల్లో మొ క్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సజ్జ ల నాగిరెడ్డి, సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, పెదబోయిన వీటీయాదవ్, వేణు, లక్ష్మారెడ్డి, అశోక్‌రెడ్డి, రవి, రమణ పాల్గొన్నారు.

● దామరచర్ల : మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యు డు సాధినేని శ్రీనివాసరావు, ఆ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి హనుమంత్‌రెడ్డి అశోక్‌రెడ్డి దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం మొక్కలను నాటారు. కార్యక్రమంలో నాయకులు జానకిరాంరెడ్డి, ఈగ సైదర్‌రావు, మేశ్యానాయక్, కృష్ణంరాజు, శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మల విజయ్, వెంపటి రాజేష్, సైదిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి,నరసింహారెడ్డి పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి : మండల కేంద్రంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి దీన్‌దయాల్ ఉపాధ్యాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో మొక్కలను నాటి మాట్లాడారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు ఇటికాల జాన్‌రెడ్డి, బొమ్మకంటి నర్సిం హ, కడియం సైదులు, వేముల లక్ష్మణ్, రాచకొండ దశరథ, దారమళ్ల నాగరాజు, రాజవరపు గురుస్వామి, సంక లమద్ది శ్రీనివాస్‌రెడ్డి, కడారి వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

● హాలియా :మండలం కొత్తపల్లి గ్రామ హైస్కూల్‌లో దీన్‌దయాల్ జయంతిని గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి మొక్కలను నాటి దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వనం రామాంజి, చలమల వెంకట్‌రెడ్డి, అసెంబ్లీ మాజీ కన్వీనర్ పట్నం నాగరాజు, శంకర్, వెంకటేష్, బ్రహ్మం, సతీష్, శంకర్, శ్రీకాంత్, నరేందర్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి :మండలంలోని కోల్ ముంతలపహాడ్ గ్రామంలో 119వ బూత్ పరిధిలో బూత్ అధ్యక్షుడు భూతరాజు కుమా ర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో చెనమోని రాములు, నెల్లికంటి గోపి, యలిజాల శ్రీను, బొడ్డు యాదయ్య, మాచర్ల వెంకటయ్య, మల్లేష్, మాత్రునాయక్, విజయనాయియక్, రాహుల్, ఉదయ్, హనుమంతు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండలో రక్తదాన శిబిరంలో పాల్గొన్న బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రవికుమార్

స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

దేవరకొండ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తూటుపల్లి రవికుమార్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదిన వేడుకల్లో భాగంగా గురువారం దేవరకొండలో టీటీడీ కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ అభివృద్ధిలో దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రాంత ప్రజలకు వివరించాలని కోరారు. అనంతరం పండిట్ దీన్‌దయాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్, కర్నాటి సురేష్, వస్కుల సుధాకర్, బెజవాడ శేఖర్, నరేందర్‌రెడ్డి, నక్క వెంకటేష్, చనమోని రాములు, ఏటి కృష్ణ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ ఆసుపత్రికి ఐదు డయాలసిస్ బెడ్లు మంజూరు

దేవరకొండ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ప్రాంతీయ ఆసుపత్రికి ఐదు డయాలసిస్ బెడ్లు మంజూరు చేస్తూ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆసుపత్రి ఇన్‌చార్జి డాక్టర్ రవిప్రకాష్ గురువారం తెలిపారు. ఆసుపత్రిలో ప్రస్తుతం ఐదు డయాలసిస్ బెడ్లు ఉండగా రోగులకు సరిపోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పలు పర్యాయాలు డీసీహెచ్ఎస్ మాతృనాయక్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పలు పర్యాయాలు ఎమ్మెల్యే బాలునాయక్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే బాలునాయక్ వైద్య ఆరోగ్యశాఖ మంత్రితోపాటు ఉన్నత అధికారులకు సమస్యను పలు పర్యాయాలు వివరించారు. దీంతో ఐదు డయాలసిస్ బెడ్లు దేవరకొండ ఆసుపత్రికి మంజూరు చేశారు. త్వరలో డయాలసిస్ బెడ్లను ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు వైద్యులు తెలిపారు. దీంతో డయాలసిస్ రోగులు కొంతమేర ఉపశమనం పొందనున్నారు.

మిషన్ ట్రిపుల్ ఆర్‌తో భద్రత

త్రిపురారం సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు మిషన్ ట్రిపుల్ ఆర్ ను పాటించడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఎస్ఐ నరేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీసులో స్థానిక పోలీసులు, జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో మిషన్ ట్రిపుల్ ఆర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ ప్రజలకు రోడ్డు భద్రత నియమాల గురించి అవగాహన కల్పించారు. మద్యం మత్తులో నడపడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, హెల్మెట్ లేకుండా చేసే ప్రయాణం అనర్థాలకు దారి తీస్తుందని ఆయన అన్నారు. అదేవిధంగా యువత గంజాయి ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రవి నాయక్, పోలీస్ సిబ్బంది వెంకటేశ్వర్లు, శేఖర్, శ్రీను, జిల్లా కళాబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా అందించాలి



దేవరకొండ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులందరికీ అవసరమైన యూరియా అందించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అధికారులను కోరారు. గురువారం క్యాంపు కార్యాలయంలో అదనపు ఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీలక్ష్మి, అధికారులతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు.జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు సరిపడా యూరియా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో యూరియా నిలువలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తు రైతులకు ఇబ్బందిలేకుండా చూడాలన్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద నిల్వలను తనిఖీ చేయాలని, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మార్కెట్‌కమిటి చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్‌రెడ్డి, బిక్కునాయక్, లోకసాని కృష్ణయ్య, రాంసింగ్, అన్నిమండలాల ఏవోలు. పోలీసులు పాల్గొన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సకాలంలో నాణ్యతతో పూర్తిచేయాలన్నారు. ఇళ్ల నిర్మాణ పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో మొదటి విడతగా 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయం సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మించుకునే ఇళ్లకు ఎప్పటికప్పుడు బిల్లులు అందజేయాలని కోరారు.

ఆర్టీఏ కార్యాలయ ఏర్పాటుకు స్థల పరిశీలన

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో ఆర్టీఏ కార్యాలయం నిర్మాణానికి తహసీల్దార్ కార్యాలయ సమీపంలో గల ఖాళీ స్థలాన్ని గురువారం ఎమ్మెల్యే బాలునాయక్ పరిశీలించారు. కార్యాలయం ఏర్పాటుతో వాహనదారుల ఇబ్బందులు తొలగుతాయని అన్నారు. మల్లేపల్లిలో ఆర్టీఏ కార్యాలయంతో వాహనదారుల ఇబ్బందులు తీరనున్నాయి. ఎమ్మెల్యే వెంట డీటీసీ వాణి, డీటీవో లావణ్య, డీటీ. ప్రశాంత్, ఎంవీఐ కొండయ్య, ఏవో జానకిరాములు, ఆర్ఐ ఓర్సు శ్రీనివాస్, నాయకులు నాయిని మాధవరెడ్డి, కాసర్ల వెంకటేశ్వర్లు, తేర సత్యంరెడ్డి, తదితరులున్నారు.

మద్యం టెండర్లకు వేళాయె

(5వ పేజీ తరువాయి)

ఆసక్తి ఉన్న వారు 21 ఏళ్ల వయసు నిండి ఉండాలి. ఆధార్‌కార్డుతో పాటు, పాన్‌కార్డు తప్పనిసరి. అదేవిధంగా నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు దరఖాస్తుతో జతచేయాలి. రూ.3లక్షల విలువైన డిమాండ్ డ్రాఫ్టను (నాన్ రీఫండబుల్) అందజేయాలి. అదేవిధంగా గతంలో ఎక్సైజ్‌శాఖ పరిధిలో కేసులు ఉండకూడదు. కుష్టు లాంటి వ్యాధులు ఉండకూడదు.

డ్రా ద్వారా రిజర్వేషన్ కేటగిరీలకు దుకాణాల కేటాయింపు

నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్లలో గురువారం సాయంత్రం ఎక్సైజ్‌శాఖ అధికారులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖల అధికారుల సమక్షంలో కలెక్టర్లు ఇలా త్రిపాఠి, తేజస్‌నందలాల్ పవార్, హనుమంతరావు డ్రా తీసి ఎస్సీ, ఎస్టీ, గౌడ్ సామాజికవర్గాలకే కేటాయించాల్సిన దుకాణాలను ఎంపికచేశారు. ఈ డ్రా కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించే క్రమంలో మొత్తం వీడియో రికార్డింగ్ చేశారు. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల ఎక్సైజ్‌శాఖల అధికారులు బి.సంతోష్, లక్ష్మానాయక్, విష్ణుమూర్తి తదితర శాఖల అధికారులతో కలెక్టర్లు టెండర్ల ప్రక్రియపై సన్నాహక సమావేశం నిర్వహించి సూచనలు అందజేశారు.

తండాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

పెద్దవూర, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గిరిజనతండాల్లో మౌలిక వసతులు,సదుపాయాల కల్పనే ఆదికర్మయోగి అభియాన్ పథకం ధ్యేయమని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు.ఆదికర్మయోగి అభియాన్ పథకంపై గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందికి విలేజ్ మాస్టర్ ట్రైనింగ్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో గిరిజన ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకురావడం జరుగుతుందన్నారు. రాబోయే ఐదేండ్లలో గిరిజన ప్రాంతాల్లో విద్యా, వైద్యం, మహిళా శిశు సంక్షేమం, డీఆర్డీఏ, జల జీవన్ మిషన్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, గిరిజన సంక్షేమశాఖ సమన్వయంతో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ కొల్లు బాలకృష్ణ, ఎంఈవో తరి రాము, దీక్షిత్, వెంకాయమ్మ, రాందాస్‌నాయక్, గిరిధర్, నగేష్ పాల్గొన్నారు.

సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



దేవరకొండ సమావేశంలో మాట్లాడుతున్న చినపాక లక్ష్మీనారాయణ

దేవరకొండ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో అక్టోబరు 26, 27 తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ అన్నారు. దేవరకొండ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ 1970లో ఏర్పాటైనప్పటి నుంచి కార్మికుల పక్షాన వారి సమస్యలపై పోరాడుతుందన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య, మండల కన్వీనర్ రహీం, నాయకులు యాదగిరి, బిజిలి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి: కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా నాయకుడు రొండి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేలా 8గంటల పనిని 10గంటలకు మార్చేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు సరైన వేతనాలు అందించకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనాన్ని అందించాలని, అర్హులైన కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయూ మండల నూతన కన్వీనర్‌గా ఖమ్మంపాటి పరశురాములు ను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు కొంగర్ల ఎల్లయ్య, బొల్లంపల్లి శ్రీనివాస్, ఇరుగు యాదమ్మ, మణెమ్మ, బాలయ్య, సైదులు, యాదయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కాత్యాయనీగా దర్శనమిచ్చిన అమ్మవారు



దేవరకొండ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

దేవరకొండ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవరకొండలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో వాసవీమాత కాత్యాయని, పార్వతీదేవిగా అలంకరించారు. ఆర్యవైశ్య సంఘంతో పాటు భక్తులు కన్యకాపరమేశ్వరి దేవాలయంలో పూజలు చేశారు. మార్కండేయస్వామి దేవాలయంలో దుర్గాదేవి పూజలు నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు.

● హాలియా: హాలియాలోని బస్టాండ్ వద్ద ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాతగా వ్యవహరించిన కుకుడాల సాయిప్రకాష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



తిరుమలగిరి (సాగర్) మండలకేంద్రంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పంట నమోదు చేసుకోవాలి



పంటలను పరిశీలిస్తున్న జేడీఏ శ్రవణ్ కుమార్

చింతపల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులందరూ పంట వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్‌కుమార్ సూచించారు. మండలంలోని వింజమూర్‌లో గురువారం పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల దిగుబడి సాధించాలంటే రసాయన ఎరువులను తగ్గించి కృతిమ ఎరువులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రావణకుమారి, ఏఈవలో మధు, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర ఆహారానికి ప్రాధాన్యమివ్వాలి

మిర్యాలగూడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రుచి కంటే ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సీబీసీ సహాయ సంచాలకుడు జి. కోటేశ్వరావు అన్నారు. పోషణ్ మాసం సందర్భంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) సమాచార సంస్థ ఆధ్వర్యంలో అందరికీ పోషకాహారంపై స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న మూడు రోజుల ఫొటో ఎగ్జిబిషన్‌లో భాగంగా రెండో రోజు కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మార్గదర్శకాలు, స్థూల, సూక్ష్మ, పోషకాల ప్రాధాన్యం, ఆహారంలో పోషక విలువలను గుర్తించే విధానం తదితర అంశాలతో కూడిన ఫొటోప్రదర్శనను నిర్వహించారు. ఆరోగ్యం, పోషకాహారంపై కళాబృందాలు పాటలు పాడి కోలాటం ప్రదర్శించారు. పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సతీష్, హరినాథ్ పాల్గొనా

గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి

హాలియా, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని కల్లుగీత కార్మిక సంఘం జి ల్లా ప్రధాన కార్యదర్శి చౌగాని సీతారాములు డిమాండ్ చేశారు. హాలియాలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలను అమలుచేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకుదెరువు కోసం ప్రమాదకరమైనప్పటికీ గీత వృత్తిని కొనసాగిస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ రూ.4వేలు, ఎక్స్‌గ్రేషియా రూ. 10లక్షలు, మద్యం దుకాణాల్లో 25శాతం అమలు చేయాలని కోరారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నర్సింగ్ సైదులు, కార్యదర్శి కాట్నం పరమేష్, ఉపాధ్యక్షుడిగా కాసాని సత్తయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడు కాట్నం యాదగిరిగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు వేముల కొండ పుల్లయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు బొడ్డు లక్ష్మి, సీఐటీయూ నాయకులు అవుతా సైదులు, చెదురుబెల్లి రాములు, సైదులు, సత్తయ్య, పరమేష్ పాల్గొన్నారు.

సినిమా గైడ్ : మిర్యాలగూడ: శ్రీనివాస : ఓజీ, వెంకటేశ్వర: మిరాయ్, రాఘవ: ఓజీ, విట్రోస్: ఓజీ, కిష్కింధపురి, మిరాయ్, దక్ష, భద్రకాళి, దేవరకొండ : మనోజ్ : లిటిల్ హర్ట్స్, మైత్రి వెంకటేశ్వర : మిరాయ్